KSR02B170C
కథా నిలయం
E
ENTERED

ప్రజాశక్తి
స్నేహ
ఆదివారం అనుబంధం
జూన్ 04, 2017

ప్రియమైన నీకు...

సోనాక్షి

విక్కీకౌశల్

జాన్ అబ్రహం

తాప్సి

సయాని

నటనే ప్రాణం

యాక్టింగ్ అంటే పడిచచ్చేవారు కొందరైతే దానికోసం కోసం మంచి ఉద్యోగాన్ని వద్దనుకున్నారు మరి కొందరు. ప్రస్తుతం బాలీవుడ్‌లో స్టార్‌డమ్‌ని సంపాదించుకున్న ఆ తారల్లో పరిణీతి చోప్రా ఒకరు. పదిహేడేళ్ళకే లండన్‌లోని మ్యాంచెస్టర్ యూనివర్సిటీలో బిజినెస్, ఫినాన్స్, ఎకనామిక్స్‌లో ట్రిపుల్ డిగ్రీని పూర్తిచేసింది పరిణీతి. మ్యాంచెస్టర్ యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ క్యాటరింగ్ డిపార్ట్ మెంట్ టీమ్ లీడ్‌గా పనిచేసిందది. ఇక 'లేడీస్ వర్సెస్ రిక్కీ'లో నటించడానికి ముందు యష్‌రాజ్ ఫిల్మ్స్ స్టూడియోకి పిఆర్ కన్సల్టెంట్‌గా పనిచేశింది పరిణీతి. 'బాంబే వెల్వెట్', 'మాసన్' చిత్రాల ద్వారా యాక్టర్‌గా మంచి పేరు తెచ్చుకున్నాడు విక్కీకౌశల్. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో బిటెక్ పూర్తిచేశాక మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చినా యాక్టింగ్‌ని ఇష్టపడే కౌశల్ ఆ అవకాశాన్ని వద్దనుకున్నాడు. తర్వాత ఓ యాక్టింగ్ స్కూల్‌లో శిక్షణ తీసుకుంటున్నప్పుడు 'లవ్ షువ్ తె చికెన్ ఖురానా'లో నటించే అవకాశం వచ్చింది. 'బాంబే వెల్‌వెట్'తో నటుడిగా నిలదొక్కుకోవడమేకాదు 'గ్యాంగెస్ ఆఫ్ వస్సీ పూర్'లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాడు కౌశల్. మోడలింగ్, యాక్టింగ్ రెండు జాన్ అబ్రహమ్‌కి పేరు తెచ్చిపెట్టాయి. అంతకంటే ముందు ఎకనామిక్స్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తిచేసిన జాన్ ఎన్టర్ ప్రైసెస్ నెక్సస్‌లో మీడియా పార్ట్నర్‌గా పనిచేశాడు. హీరోయిన్స్ విషయానికొస్తే కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తిచేసింది తాప్సి. పెద్ద జీతంతో సాఫ్ట్‌వేర్ రంగంలో జాబ్ కూడా దక్కింది. అయితే ఛానెల్ విలో ఒక టాలెంట్ షో ఆడిషన్స్‌కి వెళ్లిన తాప్సి సెలక్ట్ అయిందట. అప్పటి నుంచి యాక్టింగ్‌పై మనసుపారేసుకుంది. జాబ్‌ని వదిలిపెట్టినా యాక్టర్‌గా మంచి పేరే తెచ్చుకుంది. ఫిల్మి ఎంట్రీకి ముందు సోనాక్షి ముంబయిలోని ఒక పేరొందిన యూనివర్సిటీలో డిజైనింగ్ కోర్స్ పూర్తిచేసింది. కాస్ట్యూమ్ డిజైనర్‌గా కెరీర్‌ని ప్రారంభించాక 'మేరే దిల్ లేకే దేఖో' చిత్రంలో కాస్ట్యూమ్ డిజైనర్‌గా అవకాశం దక్కింది. అప్పుడే యాక్టర్‌గా ట్రై చేద్దామనుకుందట. అనుకోకుండా 'దబాంగ్'లో అవకాశం రావడంతో తన ట్యాలెంట్‌ని ప్రూవ్ చేసుకుంది. ఫిల్మ్‌ఫేర్ అవార్డ్‌ని గెలుచుకుంది. 'మార్గరీటా విత్ ఎ స్ట్రా' వివిధ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శించబడిన ఒక సంచలనాత్మక చిత్రం. నటిగా సయానికి గుర్తింపునిచ్చిన చిత్రం ఇది. ఫిల్మ్ కెరీర్‌కి ముందు ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రై.లి కంపెనీలో మార్కెటింగ్-సేల్స్ విభాగంలో పనిచేసింది. థియేటర్ ఆర్ట్ ప్రవేశంకోసం ఉద్యోగాన్ని వదిలి పూనెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్‌లో మూడేళ్లపాడు యాక్టింగ్‌లో శిక్షణ తీసుకుంది సయాని.

పరిణీతి చోప్రా

కథా నిలయం
ENTERED
KS R02 13170



మన చురకత్తి

ఫెన్సింగ్ పాశ్చాత్య సాంకేతిక కత్తిసాము. దేశవాళీ శైలికి భిన్నం. ఫెన్సింగ్‌లో మన క్రీడాకారుల రాణింపు మీద నిన్నామొన్నటి వరకు సందేహాలుండేవి. కానీ ఓ చురకత్తి ఫెన్సింగ్ స్ట్రిప్‌లో అడుగుపెట్టాక బౌట్ మన పక్షమైంది. మేటి ఫెన్సర్లనే గైడ్ చేసి బ్యాలెన్స్టాతో దూసుకుపోతోంది. ఆమె పేరు భవానీ దేవి. ఫెన్సింగ్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించిన ఘనత ఆమెది. 23 ఏళ్ల ఈ ఫెన్సింగ్ క్రీడాకారిణి టోక్యో ఒలింపిక్స్‌కు కసరత్తు చేస్తోంది. ఫెన్సింగ్‌లో చాలా భవిష్యత్తు ఉందని క్రీడా విశ్లేషకుల మన్ననలు అందుకుంటోన్న ఈ విజేత గురించి...

భవానీ దేవి చెన్నైలోని ఓ సామాన్య మధ్య తరగతి కుటుంబంలో 1993 ఆగస్టు 27న జన్మించింది. 2004లో సరిగ్గా తొమ్మిదేళ్ల వయస్సులో కత్తి పట్టింది. మురుగ ధనుష్కోడి బాలిక స్కూల్‌లో ఫెన్సింగ్ క్రీడలో చేరి సాధన మొదలెట్టింది. ప్రమాదకరమైన ఆట అని తెలిసినా ఆమె ఆసక్తి పట్టుదల గమనించి తల్లిదండ్రులు ఏ మాత్రం వెనుకడుగు వేయకుండా ప్రోత్సాహాన్నిచ్చారు. అటు పాఠశాలలోను ఆటకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో భవానీలో రెట్టించిన ఆత్మవిశ్వాసం ఏర్పడింది. సెయింట్ జోసెఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబిఎ పూర్తి చేసింది. పదో తరగతి పూర్తి చేశాక ఆమె ఫెన్సింగ్‌లో శిక్షణ కోసం కేరళలోని తలస్సెరీ సాయ్ అకాడెమీలో చేరింది. కోచ్ సాగర్ లగూ సారథ్యంలో మంచి నైపుణ్యం సాధించిన భవానీ 14 ఏళ్ల వయస్సులో టర్కీలోని అంతర్జాతీయ టోర్నీలో అరంగ్రేటం చేసింది. అయితే మూడు నిమిషాలు ఆలస్యంగా హాజరుకావడంతో ఆమెకు బ్లాక్ కార్డ్ ఇచ్చి పంపించేశారు. అదో రకంగా అవమానకర ఘటనే. అయినా నిరాశ చెందక తన ఆటపై మరింత పట్టు సాధించింది. 2009 కామన్‌వెల్త్ గేమ్స్‌లో తొలిసారి కాంస్యంతో అంతర్జాతీయ ఈవెంట్‌లో అదిరే అరంభాన్నిచ్చింది. ఆ తర్వాత 2010 ఫిలిప్పైన్స్‌లో జరిగిన ఆసియన్ గేమ్స్‌లో కాంస్యంతో సత్తా చాటింది. నిమిషాల వ్యవధిలో కత్తితో ప్రత్యర్థులను చిత్తు చేస్తే విజయం సొంతం చేసుకోవచ్చు. అలాంటి మెరుపులాంటి గేమ్‌లో ఏ మాత్రం తత్తర పాటుకు లోనైనా సాంకేతికంగా అనుకూలంగా మార్చుకుని ప్రత్యర్థి చెలరేగిపోయే అవకాశం ఉంది. క్షణాల్లోనే ఫలితం మారి ఓడిపోయే ఫెన్సింగ్‌లో అద్భుతమైన ఆటతీరుతో భవానీదేవి తొలి రికార్డు స్వర్ణంతో భారత్‌ను ఫెన్సింగ్ స్ట్రిప్‌లో మేటిగా నిలిపింది.

పతకాల్లో దిట్ట..

సాంబ్ర ఈవెంట్‌లో వ్యక్తిగత, టీమ్ ఈవెంట్లలో పాల్గొనే భవానీ పతకాల సాధనలోను ముందంజలో నిలిచింది. 2009 మలేసియా, 2010 థాయిల్యాండ్‌లో కాంస్యాలతో తన ప్రస్థానాన్ని మొదలెట్టింది. అ తర్వాత అంతర్జాతీయ టోర్నీల్లో తనకు తానే సాటి అన్న రీతిలో పతకాల సాధనలో దూసుకెళ్లింది. 2010 ఫిలిప్పైన్స్‌లో కాంస్యం, కామన్‌వెల్త్ గేమ్స్‌లో 2012లో వ్యక్తిగత, టీమ్ ఈవెంట్ల్లో రజత, కాంస్యాలను సాధించింది. 2014 ఫిలిప్పైన్స్ ఆసియా చాంప్‌లో రజతం తన ఖాతాలో వేసుకుంది. 2014 ఇటలీలో జరిగిన ట్యునీసియా కప్‌లో స్వర్ణంతో తన ఖ్యాతి మరింత పెంచుకుంది. మంగోలియాలో 2015లో ఆసియా కప్‌లో కాంస్యం, 2015 బెల్జియంలో ఫ్లెమిష్ ఓపెన్‌లో కాంస్యాన్ని సాధించింది.

మెరిసిందిలా...

భారత ఫెన్సింగ్ క్రీడాకారిణి చదలవాడ ఆనంద సుందర రామన్ (సీఏ) భవానీ దేవి తొలి స్వర్ణంతో అంతర్జాతీయ యవనికపై సంచలన విజయంతో మెరిసింది. సాంబ్ర ఈవెంట్‌లో రేక్జవిక్ పట్టణంలో ఐస్‌ల్యాండ్ వేదికగా ఇటీవల జరిగిన టర్నోయ్ సాటిలైట్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో బ్రిటన్ క్రీడాకారిణి సారాహ్ జేన్ హాంప్సన్‌పై నువ్వానేనా అన్న రీతిలో సాగిన ఫైనల్లో 15-13తో స్వర్ణాన్ని ఖాతాలో వేసుకుంది. చెన్నైకు చెందిన భవానీ దేవి సెమీస్‌లో బ్రిటన్‌కు చెందిన జెస్సికా కార్బో (57వ ర్యాంకర్)పై 15-11తో జయకేతనం ఎగురవేసి ఫైనల్‌కు చేరింది. ఈ టోర్నీలో గతంలో రెండుసార్లు క్వార్టర్స్ దశ చేరలేదు. పట్టుదలతో ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేస్తూ మూడో ప్రయత్నంలో దేశానికి పసిడి అందించి తన సత్తాను మరోసారి నిరూపించింది. ప్రపంచ స్థాయిలో తొలి స్వర్ణం ఇదే కావడంతో దేశమంతా ఈమె ప్రతిభను వేనోళ్ల కొనియాడింది.

- ఈశ్వర్ నెట్టెం



ఇండెక్స్

నా కళ్లతో.................3

గ్రీన్ యాత్ర

స్టార్........4

కవి.. ఫొటోగ్రాఫర్ కూడా

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం.............. 10

గాజు పెంకుల సాక్షిగా...

సేవ..............11

హరిత కేరళమ్

కవిత్వమ్..............14

వెండి మంటలు

తెలుసా 15

సముద్రం లోతు తక్కువే

ప్రియమైన నీకు...

అట్టమీది కథ...6

ఆపాత చిత్రం - 12

ఎండమావుల్లో బాటసారి

కథ 16

కూతురైనా.. కొడుకైనా ఒక్కటే

స్ఫూర్తి..........19

యాసిడ్ కాల్చలేని ఓ జీవితం

కొత్త పుస్తకాలు.............20

పైడిమర్రి జీవిత చరిత్ర

రుచి............21

గ్వావా మెక్సికన్

బాల నేస్తాలు............22

కలివి కోడి

పద వికాసం......24

మేము మా ఇల్లు

ఈవారం అట్టమీది కథలో రచయిత అన్ని తరగతుల కుటుంబాల సమగ్ర పరిస్థితులను కళ్లముందుంచారు. ధనవంతుల ఇండ్లలో మానవ సంబంధాలు ఎంతున్నా తృప్తి మంచి చెడులు మధ్యతరగతి పేదవారి మధ్య వున్నంత ఉండదన్నది చాలా యదార్థం. ధనవంతుల ఇండ్లలో అందరి విషయాలూ వారి పనివారికే తెలుస్తాయన్నది చాలా పరిశీలనాత్మకంగా చెప్పిన విషయం. ప్రకృతి వర్షం అందరికీ ఒకటే. అనేవిధంగా వర్షంలో ఆడుకుంటున్న పిల్లల పాత్రల వ్యక్తీకరణ చాలా బాగుంది. ఇలాంటి నిజాలని కండ్ల ముందు వుంచే కథనాలను ప్రచురిస్తున్న స్నేహకు కృతజ్ఞతలు. కారులో షికారుకెళ్లే అనే పాట ఇప్పటి వరకు శ్రీ శ్రీ గారిది అనుకుంటున్నా. స్నేహ ద్వారా ఆత్రేయ గారి రచన అనే విషయాన్ని తెలుసుకున్నాం. పాత సినిమా విశేషాలు మాకు అందిస్తున్నందుకు స్నేహ సిబ్బందికి ధన్యవాదాలు. అల్లిక కవిత, మర్యాద కథ బాగున్నాయి. పల్లెల్లో అంతరించి పోతున్న ఆత్మీయతలు అనురాగాలను కళ్ళకు కట్టినట్టు చూపిన కథ ఇది.

- నూకరాజు స్వరాజ్ బాబు, బసినేని పల్లె



సింపుల్ సిల్వి

ఆర్కిటెక్ట్‌గా పేరు గడించడం గొప్పవిషయమే. అయితే కుష్టు రోగుల కోసం భవనాలని నిర్మించడంతోపాటు తక్కువ ఖర్చుతో భవనాలని నిర్మించి భవననిర్మాణ శైలిలో కొత్త ఒరవడిని తెచ్చిన లారెన్స్ అభినందనీయుడు. మహిళా క్రికెట్ జట్టులో ఫాస్ట్ బౌలర్‌గా రాణిస్తూ ఆల్ రౌండర్‌గా ఎదుగుతున్న జులన్ నేటి తరం క్రీడాకారులకు మార్గదర్శకురాలు. ఆపాత చిత్రం తోడికోడళ్లు చిత్ర విశేషాలు ఆద్యంతం అలరించాయి. ఇంటికి మనిషికి వున్న అనుబంధమే వేరు. పేద, మధ్యతరగతి, సంపన్న కుటుంబాల్లో బంధాలు, అనుబంధాలు వాటి మధ్య ఇబ్బందులని కళ్లకు కట్టినట్టు చూపిన అట్టమీది కథ ఆకట్టుకుంది. వీధి పేరు విద్యార్థిని ఊహలు, గుసగుసలాడాయ్ బాగున్నాయి.

చంద్రకళ, కానూరు

ముల్లంగి బండ

మిచిగాన్‌లోని హురాన్ సరస్సులో అలల తాకిడికి ఒరుసుకుపోయి తీరం నుండి విడిపడినట్టుగా ఏర్పడిన రాతి చిత్రాలు ఆకట్టుకున్నాయి. ఈ టర్నిప్ రాక్స్ వందేళ్ల నాటివని తెలుసుకుని ఆశ్చర్యపోయాం. ఎవరో పెద్దాయన పేరో, డబ్బున్న వారి పేరో కాకుండా జార్ఖండ్‌లోని జురి గ్రామంలో వీధిపేర్లకు ఆడపిల్లల పేర్లను పెట్టడం ఒక మంచి పరిణామం. ఊహలు గుసగుస లాడాయి, మేము మా ఇల్లు అట్టమీది కథ, వినిపించే టట్టూలు, పల్లెకారుడి గుడ్ మార్నింగ్, సింపుల్ సిల్వి, గో జులన్ గో బాగున్నాయి. నవ్వుల్ పువ్వుల్ నవ్వు తెప్పించాయి.

స్మైలి.పీ, విజయవాడ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ప్రపంచాన్ని చుట్టిరావాలనేది కొందరికి చిన్ననాటి కల...ఇంకొందరి హాబీ....మరికొందరికి ప్యాషన్..పేరేదైనా ఆలోచన మాత్రం ఒక్కటే. ఆ ఆలోచనే నవీన్ రాబెల్లిని కూడా ప్రపంచయాత్ర వైపు నడిపించింది. సరదాగా యాత్ర చేసేయడమే కాదు కాలుష్యాన్ని నివారించేందుకు సొంతగా ఓ సోలార్ అటోరిక్షాని తయారుచేసుకున్నాడు. ప్రాజెక్ట్ తేజస్ పేరుతో మొదలైన ఆ యాత్ర పర్యావరణంలో కార్బన్ ఉద్గారాలని తగ్గించడంలో ఎలా సాయపడుతోందో మీరూ తెలుసుకోండి.

గ్రీన్ యాత్ర

నవీన్ రాబెల్లి పుట్టి పెరిగింది భారత్‌లోనే. ఉన్నత విద్య కోసం ఆస్ట్రేలియాకు ప్రయాణ మయ్యాడు. ఐదేళ్లపాటు అక్కడే చదువు పూర్తిచేసుకున్నాడు. ప్రపంచం మొత్తం చుట్టేస్తూ వివిధ సంస్కృతులు, సాంప్రదాయాలని తెలుసుకోవడంతోపాటు రకరకాల రుచులని ఆస్వాదించాలనేది తన చిన్ననాటి కల. ఆస్ట్రేలియాలో చదువుకునే రోజుల్లో నవీన్‌కి తన చిన్న నాటి కల మరింతగా గుర్తొచ్చేది. ఆ కలని నిజం చేసుకునేందుకు ఆస్ట్రేలియా నుండి యుకెకి ఓ ప్రయాణం మొదలుపెట్టాడు. వీలైనన్ని ఎక్కువ దేశాల్లో బసచేయాలనేది తన తపన... అయితే భారత్‌కి చేరుకోగానే ఈ ఆలోచనకి బ్రేక్ పడింది. నగరవీధుల్లో ఎక్కువమంది యువతులు ముఖానికి స్కార్ఫ్ కట్టుకుని మాత్రమే తిరుగుతుండడం తనని ఆశ్చర్యపరిచింది. పొల్యూషన్ నుంచి కాపాడుకునేందుకు మహిళలు ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారనే విషయాలు తెలిశాయి. వాహనాల ద్వారా ఉత్పన్నమవుతున్న కాలుష్య కారకాలు ప్రజలకి ఎంత ప్రమాదకరంగా మారుతున్నాయో తెలుసుకున్నాడు నవీన్. అప్పుడే పర్యావరణానికి హాని కలిగించకుండా తన యాత్ర వుండాలని డిసైడ్ అయ్యాడు. అలా జీరో పొల్యూషన్ వెహికల్ ఆలోచన తట్టింది.

భారత్‌లోని ఆటోరిక్షా నమూనాతో సౌరఫలకాలు అమర్చి పొల్యూషన్ ఫ్రీ వాహనాన్ని తయారుచేశాడు. దానిపేరే...టుక్-టుక్. సోలార్ ఎనర్జీతో నడిచే ఈ బండికి ఎలాంటి ఇంధనం అవసరంలేదు. ఈ బండితోనే తన ప్రపంచయాత్ర మొదలయ్యింది. అయితే మార్గ మధ్యలో ఒక కిలోమీటరు ప్రయాణించగానే బండి



మొరాయించింది. ఈ బండితో ఎన్నో కష్టాలని ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రయాణం కంటే బండిని బాగుచేయడానికే ఎక్కువగా డబ్బు ఖర్చుచేశాడు. కొత్త ప్రాంతాలకి చేరుకోడానికే కాదు చివరికి తినడానికి కూడా డబ్బు కరువయ్యింది. వివిధ దేశాల్లో పర్యావరణ స్పృహని కలిగించేందుకు తన యాత్రని కొనసాగించాలనుకున్నాడు నవీన్ ఆలోచనకి కాస్త బ్రేక్ పడింది. అయితే తన ఆలోచన ఆగిపోలేదు. చేరుకున్న ప్రతి దేశంలో అక్కడివారికి బ్యాట్‌మింటన్‌లో శిక్షణఇచ్చేవాడు. అలా సంపాదించిన డబ్బుతో మరో యాత్ర మొదలయ్యింది. ప్రాజెక్ట్ తేజస్ పేరుతో మొదలైన నవీన్ పర్యావరణ పరిరక్షణ యాత్ర మూడేళ్ల పాటు కొనసాగింది. వివిధ దేశాల్లో కొందరు మిత్రులు ఆర్థికంగా సాయపడ్డారు. ఆ డబ్బుతో ఆటోరిక్షాని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా రూపుదిద్దాడు. ప్రతి ఎనభై కిలోమీటర్ల ప్రయాణం తర్వాత బండిని కొంతసేపు నిలిపేవాడు. సూర్యకిరణాల ద్వారా రీచార్జ్ అయ్యే పొల్యూషన్ ఫ్రీ వాహనంతో మరో దేశానికి చేరుకునేవాడే. అస్ట్రేలియా నుండి లండన్ వరకు దాదాపు 1400.కి.మీ తను చేసిన ప్రయాణంలో ఎక్కడా వెనుదిరగాల్సిరాలేదు.

స్కూళ్ళు, కళాశాలలు విశ్వవిద్యాలయాల్లో కాలుష్యాన్ని తగ్గించే మార్గాలపై సదస్సులని నిర్వహించాడు నవీన్. ఎక్కువ మొక్కలని నాటాలంటూ హితవు చెప్పేవాడు. ఒక రకంగా జాతీయ ఆదాయం తగ్గుముఖం పట్టడానికి కాలుష్యం కూడా కారణమంటాడు నవీన్. భారత్‌లోని కేరళ, బెంగుళూరు, ఢిల్లీ నగరాలే కాదు ఆస్ట్రేలియా లాంటి దేశాల్లోనూ వాహన కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. పర్యావరణానికి హానికరంగా మారుతున్న కాలుష్య కారకాలని తగ్గించేందుకు తను నిర్వహించిన అవగాహనా సదస్సులన్నీ యువతని ఆకట్టుకున్నాయి. తను తయారుచేసిన సోలార్ ఆటోరిక్షా పనితీరుని తెలుసుకునేందుకు ఎక్కువ మంది ఇష్టపడేవారు. ఇలాంటి వాహనాలు భారత్‌లో ఎంతైనా అవసరమనేది నవీన్ అభిప్రాయం.నవీన్‌లా యాత్ర చేసేందుకు కాకపోయినా పొల్యూషన్‌ని తగ్గించేందుకైనా అన్ని దేశాల్లో సోలార్ వాహనాలు రావాలని ఆశిద్దాం.

- శర్వాణి

కవి.. ఫొటోగ్రాఫర్ కూడా



శోభన్‌బాబు పేరు వినిపిస్తే విలక్షణమైన హీరో గుర్తొస్తాడు. అదే పేరుతో ఇప్పుడో సినిమా వస్తోంది. అందులో 'అందాల రాక్షసి' ఫేమ్ రాహుల్ రవీంద్రన్ నటిస్తున్నాడు. టైటిల్‌కు బాగా సూటయ్యే యువ హీరో అని చాలామంది అంటున్నారు. తమిళ తెరపై పరిచయమై తెలుగులో స్థిరపడుతోన్న హీరోల్లో ఒకడిగా రాహుల్‌ను చెప్పుకోవచ్చు. తను ప్రేమించేది తెలుగు చిత్ర పరిశ్రమనే. ఈ యువ స్టార్ హీరో గురించి కొన్ని వివరాలు మీ కోసం...

రాహుల్ రవీంద్రన్‌ది చెన్నై. తంజావూర్ నుంచి వచ్చి స్థిరపడిన కుటుంబం.

- విద్యా మందిర్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదివాక కామర్స్‌లో డిగ్రీ పూర్తి చేశాడు.
- బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ చేసే సమయంలో కొన్నాళ్లు ముంబైలో ఉన్నాడు. అప్పుడే ఓ ప్రముఖ మీడియా కంపెనీలో అసిస్టెంట్ బ్రాండ్ మేనేజర్‌గా పనిచేశాడు.
- ముంబైలో ఉన్నప్పుడే అనుకోకుండా యాడ్స్‌లో నటించే అవకాశం వచ్చింది. దర్శకుడు దిబాకర్ బెనర్జీ ఓ రెస్టారెంట్‌లో రాహుల్‌ను చూసి అవకాశాన్నిచ్చాడు.
- 2005లో ఓ షార్ట్‌ఫిల్మ్‌కు స్క్రిప్ట్ రాసుకున్నాడు. ముంబైలోనే దాన్ని ఇంగ్లిష్-హిందీ వెర్షన్లలో తీద్దామనుకున్నాడు కానీ అది అటకెక్కింది.
- మరిన్ని కమర్షియల్స్‌లో చేస్తూనే డబ్బింగ్ కూడా చెప్పేవాడు. ముఖ్యంగా చిన్నపిల్లల కార్టూన్ ప్రోగ్రామ్‌లకు తమిళ్ లీడ్ వాయిస్‌ను ఇచ్చేవాడు.
- పవర్ రేంజర్స్‌లో రెడ్ రేంజర్‌కు తమిళ్‌లో గొంతునిచ్చింది రాహులే. అలాగే పవర్ రేంజర్స్ ఎస్‌పిడిలో మిస్టిక్ ఫోర్స్, వైట్ రేంజర్ పాత్రలకు డబ్బింగ్ చెప్పాడు.
- తర్వాత దర్శకత్వ శాఖపై ఇష్టంతో అసిస్టెంట్ డైరెక్టర్‌గా అవకాశాల కోసం చెన్నై వచ్చేశాడు. ఈ సమయంలోనే 2006లో తమిళ్ ఫ్లిక్ 'మద్రాసీ'లో ఓ పాత్ర చేశాడు.
- 'మాస్కోవిన్ కావెరీ' (2010) చిత్రంలో నటించేందుకు అవకాశం దక్కింది. దర్శకుడు రవి వర్మన్ ఓ యాడ్‌లో రాహుల్‌ను చూసి ఈ చిత్రానికి ఎంపిక చేశాడు.
- 'మాస్కోవిన్ కావెరీ'లో సమంత కూడా నటించింది. అప్పుడామె ఇంకా స్టార్‌గా మారలేదు. థమన్ సంగీతం అందించిన తొలి చిత్రాల్లో అదొకటి. కానీ ఆ చిత్రం ఆలస్యంగా పూర్తయింది. అనుకున్న ఫలితాన్నివ్వలేదు.
- ఈ చిత్రం తర్వాత విఘ్నేష్ మీనన్ 'విన్మీంగల్'లో అవకాశమిచ్చాడు. సెరెబ్రల్ పాల్సీతో కుర్చీకే పరిమితమైన ఓ కుర్రాడి కథ అది. కేవలం శారీరికంగానే కాక మానసికంగానూ ఆ పాత్రలో ఒదిగిపోయాడని రాహుల్‌కు ప్రశంసలు దక్కాయి.
- తమిళ్‌లో మూడో చిత్రం 'సూర్యనగరం' తర్వాత 2012లో తెలుగులో 'అందాల రాక్షసి'లో అవకాశం వచ్చింది. ఈ చిత్రంలో సాటి హీరోతో పోటాపోటీగా నటించి మంచి మార్కులు వేసుకున్నాడు. ఆ చిత్రంతోనే స్టార్ ఇమేజ్ వచ్చేసింది.'
- 'అందాల రాక్షసి' తర్వాత అవకాశాలు వెల్లువెత్తాయి. తమిళ్‌లో ఓ సపోర్ట్ రోల్ చేశాక తెలుగులో వెంట వెంటనే 'పెళ్లి పుస్తకం', 'నేనేం చిన్నపిల్లనా...' చిత్రాలు వచ్చినా ఆశించిన స్థాయిలో ఆడలేదు.
- 2012లోనే 'హౌజ్ ఆఫ్ అబాండన్డ్ రోబోట్స్' అనే ఆంగ్ల చిత్రంలో నటించాడు. ఇదింకా విడుదల కాలేదు.
- 2014లో వచ్చిన 'గాలిపటం', 'టైగర్'లు అంతగా ఆకట్టుకోలేకున్నా 'అలా ఎలా' మళ్లీ కెరీర్ పుంజుకునేలా చేసింది.
- 'హైదరాబాదీ లవ్‌స్టోరీ' అనే తెలుగు చిత్రం, 'పల్నాడు వాజ్గా' అనే తమిళ్ చిత్రం నిర్మాణం కావాల్సిఉంది.
- ఈ మధ్యలో మహేష్ బాబు 'శ్రీమంతుడు'లో ప్రత్యేక పాత్రలో కనిపించాడు రాహుల్.
- ప్రముఖ గాయని చిన్మయితో ప్రేమలో పడిన రాహుల్ ఆమెనే పెళ్లాడాడు.
- రాహుల్‌కు ఫొటోగ్రఫీ అంటే ఇష్టం. తన మొబైల్‌తోనే ఆసక్తి అనిపించిన దృశ్యాల్ని ఫొటోలు తీసి ట్విట్టర్‌లో ఫొటోబ్లాగ్‌లుగా పెట్టేస్తుంటాడు.
- సమాజానికి, వ్యక్తిగత స్వభావానికి మధ్య నలిగిపోయే వ్యక్తి జీవితం మీద తెరకెక్కిన 'కూల్ హ్యాండ్ ల్యూక్' 1967 చిత్రమంటే రాహుల్‌కు ఆల్‌టైమ్ ఫేవరెట్. ఈ చిత్రాన్ని 40 సార్లకు పైనే చూశాడట. ఈ చిత్రంలో నటించి పాల్ న్యూమాన్ రాహుల్‌కు ఆరాధ్య నటుడు.
- సత్యజిత్ రే ప్రతిష్టాత్మక చిత్రం 'పథేర్ పాంచాలి' తర్వాత 'అపు' ట్రయాలజీలో వచ్చిన 'అపరాజితో'కి వీరాభిమాని. సామాన్యుని కష్టాల్ని, కన్నీళ్లని, జీవితాన్నే ఎపిక్‌గా మలిచిన ఆ చిత్రాన్ని ఎన్నిసార్లైనా చూస్తాడట.
- ప్రపంచాన్ని తలకిందులు చేసే శక్తి ఉన్న వ్యక్తులు కూడా అందరిలాగే భావోద్వేగాలతో, వ్యామోహాలతో సామాన్యంగానే కనిపిస్తారని చెప్పే 'డాక్టర్ స్ట్రేంజ్‌లవ్' ఆంగ్ల చిత్రంతో పాటు అమ్మ విలువ చెప్పే స్పానిష్ చిత్రమైన 'టోడో సొబ్రే మి మాద్రే', యుద్ధ బీభత్సాన్ని, ప్రభుత్వాల చెలగాటాన్ని కళ్లకు కట్టి స్థాణువుల్ని చేసే జపనీస్ యానిమేషన్ చిత్రం 'గ్రేవ్ ఆఫ్ ది ఫైర్‌ఫ్లైస్' రాహుల్‌కు ఫేవరెట్ చిత్రాలు.
- రివ్యూల్లా కాకుండా తన ఆలోచనల్లా కొత్త చిత్రాల గురించి అభిప్రాయాలు పంచుకుంటాడు. వాటిలో కీలక విషయాలను చాలా అద్భుతంగా విశ్లేషిస్తూ సినిమా తీసే కష్టాన్ని అర్థం చేసుకునేలా చెప్తాడు.
- ఆంగ్లంలో కవిత్వం రాయడం కూడా ఓ అభిరుచి. తను తీసిన ప్రతీకాత్మక చిత్రాలను తన కవిత్వానికి వాడుతుంటాడు. అలాగే క్రీడలన్నా అభిమానమే.

\- జేఎస్

నవ్వుల్ - పువ్వుల్

అతితెలివి

అప్పారావు : ఏంట్రా గంటని ఫ్రిజ్‌లో పెట్టావ్.

వెంగళప్ప : ఇందాక టీ.విలో ఒక వంటల కార్యక్రమం ఫాలో అయ్యా..అందులో కూరమొత్తం అయ్యాక ...ఫ్రిజ్‌లో 'ఓ గంట' పెట్టమంది యాంకర్...అందుకే...!!

అప్పారావు : అమె పెట్టమంది కూరని కాదురా..! గంటని.

ఫాలోయింగ్

నేనున్న చోటల్లా జనం గుంపులు గుంపులుగా కనిపించాలంటే ఏం చేయాలోయ్ అడిగాడు ఓ మంత్రి..

సెక్రటరీ : మీరుండే ప్రతి చోటా ఫ్రీ వైఫై జోన్ ప్రకటించేయండి సార్!!

దిగాలు

రవి : ఏంట్రా శ్రీను బాగా దిగాలుగా వున్నావ్. నిన్ననే పడ్డావట...దెబ్బలు నెప్పెడుతున్నాయా ఏంట్రా..

శ్రీను : అదికాదు...నేను పడిపోయిన వెంటనే ఫేస్ బుక్‌లో పిక్ అప్‌లోడ్ చేసా....ఇప్పటికి ఒక్కలైక్ కూడా రాలేదు...

రవి : ఆ...

పెళ్ళిరోజు

సంతోష్ తన ఫ్రెండ్స్‌ని కలిసాడు.

ఈ రోజు నా మ్యారేజ్‌డేరా!

ఫ్రెండ్స్ : అయితే మమ్మల్నేం చేయమంటావ్

సంతోష్ : అదేంట్రా విష్‌చేయరా!!

ఫ్రెండ్స్ : పిల్లదొరక్కా.. పెళ్లికాక మేం చస్తూంటే ఏంట్రా నీ గోలా..!

కిసుక్కు

వెంకి : మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుందే.... ఫేస్‌బుక్‌లోగానీ, ట్విటర్‌లోగానీ ఇన్‌స్టాగ్రామ్‌లోగాని ఉన్నారా?

చంటి : లేదండి పదేళ్ల నుంచి మీ పక్కింట్లో ఉంటున్నా....



కొత్తగా..



రవి : ఏంటి కొత్త హెయిర్‌స్టైలా!?

సోము : కాదు కొత్త షాంపు ట్రైచేసా...ఆల్ క్లియర్ అని రాసుంటే డాండ్రఫ్ అనుకున్నా.....వాడాకే తెలిసింది జుట్టని.

నాకు నచ్చిన చిత్రం



సేకరణ: పి.బాలు, మచిలీపట్నం

కిసుక్కు సిత్రం



హమ్మయ్య వానలు పడుతున్నాయ్...

అట్టమీది కథ



ప్రియమైన నీకు...

- సత్యాజీ
9490099167

ఉత్తరం ఒక మహత్తర జ్ఞాపకం. ఎన్నో ఎదురుచూపుల వ్యాపకం. ఆత్మీయ కబుర్ల పంపకం. అనురాగ వెల్లువల ఆనంద తాండవం. మళ్లీ మళ్లీ ఆవిష్కరించుకునే దృశ్య మాధుర్యం. మనసుకు మల్లియల సౌరభం. ఒక తరం క్రితం వరకూ మన లోగిళ్లకు వెలుగు. ఇప్పుడు పాతబడవచ్చు. అంతగా పలకరించకపోవొచ్చు. కానీ, దాని పరిమళం ఎప్పటికీ గుబాళిస్తుంది. తలచిన కొద్దీ మధురమవుతుంది. 'ప్రియమైన నీకు ..' అంటూ- జ్ఞాపకాల పొరల్లోంచి పురి విప్పుతుంది.

వీధి చివర సైకిలు బెల్లు మోత ఇంట్లో ఎక్కడ ఉన్నా వినిపించేది. అతడి రాకను పెరట్లో నుంచే పసిగట్టేవాళ్లం. గుమ్మం ముందు ఆగాడని చూడకుండానే గమనించేవాళ్లం. 'పోస్ట్ ..' అని పిలవకముందే అతడి ముందు ప్రత్యక్షమయ్యేవాళ్లం. అతడు చిర్నవ్వు ఒలికిస్తూ- ఓ కాగితాన్ని చేతిలో పెడితే- ఆనందమే ఆనందం. దానిలో ఏముందోనని ఒకటే ఆత్రుత.

అది వట్టి కాగితం కాదు. ఉత్తరం..

అనేక కబుర్ల, ఉద్వేగాల సమాహారం!

ఇంతకీ ఆ ఉత్తరం ఎవరికి? ఎవరు రాశారు?

పెద్దక్కకు బావ రాస్తే- అది పూర్తిగా అక్కకే సొంతం. కానీ, అక్క చేతిలోకి ఒక్కపట్టాన వెళ్లనీకుండా అల్లరి తంతు కొంత నడుస్తుంది. అదొక సరదా. 'అక్కా .. చించేస్తున్నాను..' చిన్ని అక్క ఆట పట్టింపు! 'ఇక చాల్లే.. చేసిన అల్లరి చాలు.. ఇచ్చేయండి..' అమ్మ మందలింపు.

ఆ ఉత్తరం ఈ చేతి నుంచి ఆ చేతికి అలా అలా మారుతూ ఉంటే- పెద్దక్కకు ప్రాణం విలవిల్లాడుతుంది. ఆఖరికి చేతికి అందితే- హమ్మయ్యా అని హృదయానికి హత్తుకుంటుంది. మేడ మీది తన గదిలో ఏకాంతంగా చదూకోవటానికి పరుగు పెడుతుంది! అప్పుడు అక్క మనసే కాదు; ఇల్లంతా పులకరిస్తుంది.

అమ్మమ్మకు మిలట్రీ నుంచి చిన్న మావయ్య రాస్తే- అదొక ఉద్వేగం. అది మాత్రం ఇంట్లో అందరికీ ఉత్తరమే! ఆత్రుత తప్ప అల్లర్లు ఉండవు. జెండాకు వందనం చేస్తున్నంత నిశ్శబ్దం. అమ్మమ్మ కళ్లల్లో ఆత్రుతతో పాటు కన్నీళ్లు. అమ్మో, నాన్నో చదవటం ప్రారంభిస్తారు. అందరం ఒళ్లంతా చెవులు చేసుకొని వినటం ఒక ఉద్విగ్నభరిత అనుభవం.

అన్నయ్య కాలేజీ నుంచి రాసే ఉత్తరం ఒక రకం. అమ్మకు, నాన్నకు నమస్కారాలు ఉంటాయి. అక్కలను, తమ్ముడిని అడిగినట్టు చెప్పండి అన్న వాక్యాలు ఎప్పుడూ ఉంటాయి. మేము ఎదురుచూసే వాక్యం ఒకటి అండర్‌లైను చేసి ఉంటుంది. 'ఈనెల పరీక్ష ఫీజు కట్టాలి. హాస్టలుకు కూడా ఫీజు కట్టాలి. ఇతర ఖర్చులూ ఉన్నాయి. రూ.550లు మనియార్డరు చేయగలరు.' ఇది వినగానే - అందరూ నవ్వులు. పెద్దక్క అంటుంది... 'ఈ ఉత్తరం బరువు 550 గ్రాములు అన్నమాట..' నాన్న పంపాల్సిన డబ్బు గురించి ఆలోచనలో పడతాడు. 'ఏమి తింటున్నాడో.. ఎలా ఉన్నాడో ..' అమ్మ కన్నీళ్లు తుడుచుకుంటుంది.

ఇవి ఓ పదిహేనూ, ఇరవై ఏళ్ల క్రితం వరకూ మన లోగిళ్లలో కనపడిన దృశ్యాలు. ఉత్తరాలు పంచిన ఆనంద ఉద్వేగాలు. ఊరూరా అల్లుకున్న ఉత్తర బాంధవ్యాలు.

వేచిచూడడం అనే దానికి ఒక లక్షణం ఉంది.

అది దేని కోసం చూస్తే - దానిని రెట్టింపు చేస్తూ పోతుంది.

క్షణక్షణానికీ మల్టిప్లై అవుతుంది.

ఉత్తరం అలాంటి పనినే చేస్తుంది.

అక్కడ రాయడం నుంచి ఇక్కడికి చేరడం వరకూ కొన్ని రోజుల సమయం పడుతుంది. అనేక చేతులు మారుతూ వస్తుంది. ఈ ప్రక్రియ మధ్య నిరీక్షణ, ఆత్రుత వంటి భావోద్వేగాలు తప్పనిసరి అవుతాయి. వాటిని కుటుంబ సభ్యులూ, స్నేహితులూ పంచుకోవడం కూడా అనివార్యం అవుతుంది. అందుకనే ఉత్తరం మనకొక ఆత్మీయ నేస్తమయ్యింది.

అన్నయ్య, అక్కల తరం వరకూ సాగిన ఈ ఉత్తర పర్వం ఇప్పుడు దాదాపుగా లేదు. ఏ కొందరో తప్ప ఎక్కువమంది ఉత్తరాలు రాయడం మానేశారు. మనమిప్పుడు స్పీడు యుగంలో ఉన్నాం. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా క్షణాల్లో సమాచార మార్పిడి జరిగిపోతుంది. నేరుగా మాట్లాడుకుంటున్నాం. ఒకరినొకరు చూస్తూ మాట్లాడుకునే సాంకేతిక పరిజ్ఞానం చాలావరకూ పల్లెటూళ్లకూ వచ్చేసింది! జీవితంలో అన్నింటా వేగం పెరిగింది. తీరిగ్గా రాసే పొడవైన ఉత్తరాలు ఇప్పుడు కాలం చెల్లిపోయాయి. పొట్టిపొట్టి మెసేజీలు అత్యంత వేగంగా అటూ ఇటూ బట్వాడా అయిపోతున్నాయి. ఇప్పుడు ఒక పదాన్ని పూర్తిగా రాసేంత ఓపిక, తీరికా ఉండడం లేదు. భావానికి తప్ప భాషకు, వ్యక్తీకరణకూ ప్రాధాన్యం ఉండడం

లేదు. ప్రపంచీకరణలోని అనేక అంశాలు లాగానే - భాష, వ్యక్తీకరణ కూడా ఏకీకరణ చెందుతున్నాయి. అంటే- ఎవరు ఏం రాసినా, ఏం చెప్పినా ఒకేలా చెప్పటం పెరుగుతోంది. దీనివల్ల భావోద్వేగాల్లో కూడా రొటీనిజం చోటు చేసుకుంటుంది. ఉద్వేగపరంగా వేగంగా మారిపోయే, మర్చిపోయే దశలో మనం ఉన్నాం. 'ప్రేమిస్తున్నాను' అని చెప్పటానికి ఎవరో తయారు చేసిన గ్రీటింగు కార్డు, ఎవరో తయారు చేసిన ఒక చిహ్నం, ఎందరో చెప్పుకున్న ఒక రొటీన్ వాక్యం .. అంతే! ఇది వైవిధ్యం, స్వీయ భావోద్వేగం లేని సాంకేతిక ప్రవర్తన. ప్రపంచంలోని ఏ ఇద్దరు వ్యక్తుల ఆలోచనలూ, ఉద్వేగ స్థాయిలూ, సృజనాత్మక కోణాలూ ఒకేలా ఉండవు. ఒకరి భావనను మరొకరు వ్యక్తం చేయడం అసాధ్యం. కాబట్టే - రెడీమేడ్ గ్రీటింగులూ, మెసేజీలూ - మనం సొంతంగా రాసే ఉత్తరానికి ఎప్పటికీ సాటిరావు.

ఆత్మీయతకు ఆనవాళ్ళు

ఉత్తరాలు ఎందుకంత ప్రత్యేకం అంటే- అవి మనల్ని మనంగా చూపిస్తున్నాయి. మన భాష, మన దస్తూరి, మన అలవాటు, మన సంబోధన, మన సంభాషణ, మన వ్యక్తీకరణ- యథాతథంగా రికార్డు చేస్తాయి. రాసిన వారి గురుతుల్ని, ఉద్వేగభరిత చిహ్నాల్ని మోసుకొస్తాయి. కొన్ని ఉత్తరాల్లో కాటుక కళ్ల ఆనవాళ్ళు ఉంటాయి. కుంకుమ అద్దిన గురుతులు ఉంటాయి. ఇంకొన్నింటిలో మురిపెపు ముద్దుల స్పర్శలు, పూల గుబాళింపులు ఉంటాయి. మరికొన్నింటిలో కన్నీరు చెరిపిన అక్షరాల జాడలు, చెమట్లు అంటించిన చేతివేళ్ల రేఖలు ఉంటాయి. ఇలాంటి జ్ఞాపక చిహ్నాలను లక్షలు పెట్టి కొన్న పెయింటింగో, మరొక ఖరీదైన కానుకో ఇవ్వగలదా? అసంభవం.

కొన్ని ఉత్తరాలు ఎప్పటికీ ఆనందాన్నిస్తూనే ఉంటాయి. 'వనితకు పాప పుట్టింది. బుజ్జిబుజ్జి చేతులతో, బోసినవ్వుతో భలే ఉంది. పాప ఉయ్యాల పక్కన కూచొనే ఈ ఉత్తరం రాస్తున్నాను.' అని రాసిన వాక్యాలను చదివినప్పుడు ఆ పాపను చూసినట్టే అనిపిస్తుంది. వెంటనే వెళ్లి చూడాలనీ అనిపిస్తుంది. ఎక్కడో ఉద్యోగంలో స్థిరపడ్డ కొడుక్కి - 'నాన్నా, నువ్వు పెరట్లో నాటిన బంగినపల్లి మామిడి పెద్ద చెట్టు అయిపోయింది. ఈ ఏడాది బాగా కాసింది. ఆ చెట్టును చూసినప్పుడల్లా - నువ్వే గుర్తొస్తున్నావు..' అని రాసిన వాక్యం ఎంత తీయని ఆత్రుతగా ఉంటుంది!

ఉత్తరం ... ఉమ్మడితత్వం

స్పీడు యుగపు మెసేజీలు పొట్టివే కాదు, సంకుచితం కూడా! వ్యక్తికే పరిమితం అవుతాయి. పక్కవారిని కలిపి పరామర్శించే లక్షణం దానికి ఉండదు. అప్పటి ఉత్తరం అలా కాదు; ఇంటిల్లిపాదినీ పేరుపేరునా పలకరించేది! అందరి గురించీ ఆరా తీసేది! 'బుజ్జిగాడు ఎలా ఉన్నాడు? రోజూ స్కూలికి వెళుతున్నాడా? సెలవులకు వచ్చినప్పుడు కొనిచ్చిన కథల పుస్తకం పూర్తిగా చదివేశాడా? చెల్లి ఎలా ఉంది? కనకాంబరం చెట్లు బాగా పూశాయా? కనకం పిన్ని ఇచ్చిన రేఖ మందారం అంటు ఎదుగుతోందా? పక్కింటి పార్వతమ్మ పెద్దమ్మ ఎలా ఉన్నారు? బసవపున్నమ్మ అమ్మమ్మ ఆరోగ్యం బాగానే ఉందా?' ... ఇంత పెద్ద భోగట్టాల విచారణ సాగుతూ ఉండేది ఒక చిన్ని ఉత్తరంలో. దానిలో రాసిన వాళ్లందరికీ ఆ వాకబుల



ఉత్తరం రాద్దామా?

ఉత్తరం రాయడంలో, చదవడంలో మాధుర్యం ఉంది. అందుకనే కొన్ని సంస్థలూ, పత్రికలూ లేఖారచనను ప్రోత్సహిస్తున్నాయి. ఉత్తరం ఒక ప్రత్యక్ష అనుభూతి. దానిలో చేతిరాతది కూడా కీలకపాత్ర. అప్పుడప్పుడు ఉత్తరం రాయడం ఒక పనిగా పెట్టుకోవాలి.

- తాతయ్య, నానమ్మలకు పిల్లల చేత ఉత్తరాలు రాయించాలి. 'ప్రియమైన నాన్నమ్మ, తాతయ్యలకు నమస్కరించి రాయునది..' అన్న వాక్యం ఫోన్లో పలకరింపు కన్నా ఆత్మీయంగా ఉంటుంది. ఆ అక్షరాల్లో పెద్దలకు పిల్లల మోము ప్రత్యక్ష దర్శనమవుతుంది.

- మాట్లాడడం కన్నా రాయడంలో వ్యక్తీకరణ విస్తృతి పెరుగుతుంది. మాటల్లో రాని భాషా సౌందర్యం రాతలో వస్తుంది. మన జాతీయాలు, నానుళ్ళు, పోలికలు, వర్ణనలు రాతతోనే సాధ్యం.

- పెళ్లిరోజు, పుట్టినరోజు, ఇంకా ముఖ్య సందర్భాలను పురస్కరించుకొని భాగస్వామికి ఉత్తరం రాయొచ్చు. పాత జ్ఞాపకాలను తవ్వి తీయొచ్చు. కొత్త పరిమళాలు అద్దవచ్చు. కృతజ్ఞతలు చెప్పొచ్చు. ప్రేమతో అభినందించవచ్చు. ఎందుకు, ఎంతగా ప్రేమిస్తున్నారో వివరంగా రాయొచ్చు.

- పాత స్నేహితులకు, బాల్యమిత్రులకు ఒకసారి ఉత్తరాలు రాసి చూడండి. మొక్కుబడిగా కాదు; మనసు పెట్టి రాయండి.

- పిల్లలకు కూడా ఉత్తరాలు రాయండి. మనం ప్రత్యేకంగా చెప్పదగిన విషయాలు, మళ్లీమళ్లీ గుర్తు చేయాలనుకున్నవి ఉత్తరంలో రాస్తే - ఆ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

- హాస్టల్లో ఉండి చదువుతున్న పిల్లలకే కాదు; ఇంట్లో ఉన్న పిల్లలకూ కూడా రాసి చూడండి.

- చేతిరాత ఆత్మీయతకు చేవ్రాలు. మనకు బదులుగా నిలిచే సజీవ ఆనవాలు. ఆ అక్షరాల్లో మనం కనిపిస్తాం. కంప్యూటరు అక్షరాలకు భావస్పర్శే కానీ, దృశ్యస్పర్శ ఉండదు.

సంగతి చెప్పాలి. విన్న వాళ్లకు ఎంత మురిపెమో! 'శారదమ్మ నన్నెప్పుడూ మర్చిపోదు వదినా ...' అని ఆనందపడి పోతుంది బసవపున్నమ్మ.

అనురాగ భావనల వెల్లువ

పుట్టింటికి కాన్పు కోసం వచ్చిన కృష్ణవేణి అక్కకు అయితే– ఉత్తరాలు రాయడం ఒక నిరంతర పని. ఇన్లాండు ఉత్తరాలు సరిపోయేవి కాదు. రెండు, మూడు దస్తాల తెల్ల కాగితాలు రప్పించి, వాటి మీద రాస్తూనే ఉండేది. 'ఈరోజు ఇక్కడ వర్షం వచ్చింది. మన పాప ఎంత మురిసిపోతుందో, వానను చూసి. తను పుట్టాక ఇదే మొదట వర్షం. అయ్యో.. తుంపర్లు ఈ పేపరు మీద పడుతున్నాయి. వరండాలో కూచొని రాస్తున్నాను..'

'మన బంగారుతల్లి ఈరోజు ఈ కొస నుంచి ఈ కొసకు ఎంత వేగంగా పాకిందో... ఇద్దో.. ఈ ఉత్తరంలో రెండో పేజీ చిరిగిపోయిందని నన్ను తిట్టుకోకండి.. అది మీ కూతురు చేసిన పనే! నేను ఇలా కింద పెట్టానో, లేదో ! గబుక్కున లాగేసి, ఇలా చేసింది ..'

'ఈరోజు ఏం జరిగిందో తెలుసా? పెరట్లోని జామచెట్టు కింద అమ్మ బంగారుని అడ్డాల్లో వేసుకొని స్నానం చేయిస్తుంది. ఇంతలో చెట్టు మీదికి కోయిల వచ్చి కూకూ అంటూ కూయడం మొదలెట్టింది. బంగారు ఉన్న పళాన ఇటు తిరిగిపోవాలని, ఎంత ప్రయత్నం చేసిందో! కూకూలు విని ఎంత మురిసిపోయిందో ..!'

ఇలాంటి ఉత్తరాలు అప్పటికే కాదు, ఎప్పటికీ బాగుంటాయి. ఆ ఆనందాన్ని చదివిన ప్రతిసారీ మనసున వెల్లివిరిసేలా చేస్తాయి.

ఉత్తరాల గుత్తి

మండువా లోగిలి అయినా, మామూలు ఇల్లు అయినా– గుమ్మంలో ఉత్తరాల గుత్తి వేలాడుతూ ఉండేది. సాధారణ ఉత్తరాలన్నీ దానికి కొలువు తీరేవి. ముఖ్యమైన ఉత్తరాలయితే– పెట్టెల్లోకి వెళ్లేవి. చావు, పెద్ద కర్మ వంటి కబుర్లను మోసుకొచ్చే ఉత్తరాలు నలువైపులా నల్లని రంగును పూసుకొని ఉండేవి. సమాచారం తెలుసుకున్నాక వాటిని చింపే పడేసేవారు. శుభవార్తలను మోసుకొచ్చే జాబులకైతే– పోస్టుమ్యానుకు కాస్తో కూస్తో నజరానా ఉండేది. భూమి లావాదేవీలు, లాయర్ల నోటీసులు, కోర్టు కాగితాలు అయితే– అంతా గంభీర వాతావరణం. వాటిలోని సారాంశం తెలియాలంటే– కరణం గారింటికి వెళ్లాల్సిందే! అవి ఉత్తరాల గుత్తికి అసలే ఎక్కవు. అక్కకు బావ రాసేవి స్పెషల్. అవి కూడా పెట్టెలోకే! ఇంటి ఉమ్మడి జాబులు మాత్రం ఉత్తరాల గుత్తిలో చేరుతూ ఉండేవి.

ఉత్తరం చిరంజీవి

తరాలు మారొచ్చు. రోజులు మారొచ్చు. సాంకేతికంగా అనేక సదుపాయాలూ అందుబాట్లోకి వచ్చి ఉండొచ్చు. కానీ, ఉత్తరం ఉత్తరమే! భావోద్వేగాల వ్యక్తీకరణకు అది ఎప్పటికీ మహత్తర వాహకం. అది కేవలం సమాచార సాధనం కాదు. ఆత్మీయతకు ఆనవాలు. మనిషికి, మనసుకూ ప్రతీక. మనసును అక్షరాలుగా, పదాలుగా పరిస్తే– ఉత్తరం అవుతుంది.

అది డిలీట్ అయిపోయే మెసేజీ కాదు. నచ్చిన ఉత్తరాన్ని మళ్లీ మళ్లీ చదువుకోవొచ్చు. తనే వాడిన కాగితం, తనే రాసిన అక్షరం, తన మనసు నుంచే వచ్చిన భావం, తనది మాత్రమే అయిన దస్తూరీ – ఎప్పటికీ చిరంజీవి. ఒక ఆత్మీయమైన అనుభూతిని ఎప్పటికీ అందిస్తూనే ఉంటుంది. కొత్త కొత్త సమాచార సాధనాలు వచ్చినప్పటికీ– అప్పుడప్పుడైనా– ఆత్మీయుల కోసం ఉత్తరం రాయడం ఉత్తమోత్తమ పని. ఒక చిత్రం గీచినట్టుగా, ఒక శిల్పం చెక్కినట్టుగా, ఒక రుచికరమైన వంటకం చేసినట్టుగా – ఒక ఉత్తరం రాద్దాం. ఉత్తరం దూరాలను కలిపే దారం అంటారు. అంతేకాదు; దూరాలను చెరిపే దారం కూడా. దగ్గరకు చేర్చే ద్వారం కూడా!

సినిమాల్లో, కథల్లో ఉత్తరాలు

చాలా సినిమాల్లో ఉత్తరమే పెద్ద సబ్జెక్టు. 'ప్రేమలేఖ' సినిమాలో ఉత్తరాల ఆధారంగా హీరో హీరోయిన్ల ప్రేమ నడుస్తుంది. 'అల్లరి ప్రియుడు' 'ప్రియమైన నీకు' సినిమాల్లో కూడా ఉత్తరాలే ప్రేమకు మూలం అవుతాయి. కేవలం ఉత్తరాలతోనే నడిచే ఒక ప్రయోగాత్మక నవలను 'దూరం' పేరుతో మల్లాది వెంకట కృష్ణమూర్తి

రాశారు. దానిలో ఒక్క వాక్యం కూడా నెరేషన్ ఉండదు. ఉత్తరాల ప్రస్తావన ఉన్న సినీ పాటలూ చాలా ఉన్నాయి. 'ఉత్తరాల ఊర్వశి.. ప్రేమలేఖ ప్రేయసి..' పాట అల్లరి ప్రియుడు సినిమాలో బాగా పాపులర్ అయింది. 'కొమ్మకొమ్మకో సన్నాయి' పేరుతో ఉత్తరాల రూపంలో నడిచే కథల సంపుటి ఉంది. సమకాలీన పరిణామాలపై ఓ మాసపత్రికలో జాజిమల్లి, విమల 'సప్తవర్ణ లేఖ' పేరిట లేఖల రూపంలో ఒక శీర్షిక నడుపుతున్నారు.

ప్రేమలేఖలు



లేఖల్లో ప్రేమలేఖలు వేరు. అవి రాయటానికి పడే తపనా, తాపత్రయం వేరు. ప్రేమికులు, వేర్వేరు చోట్ల ఉన్నప్పుడు కొత్త దంపతులూ రాసుకున్న లేఖలు మధురంగా ఉంటాయి. వాట్సాప్, మెసెంజర్లు లేని సమయంలో – భావ వ్యక్తీకరణకు ఉత్తరమే మహత్తర మార్గం. ఉత్తరం రాయటానికైనా భాష మీద పట్టు రావాలి. దానికోసం కవిత్వమో, కథలో చదవాలి. అందుకోసం లైబ్రరీకి వెళ్లాలి. నవలలు కూడా చదవాలి. అలా పుస్తకాలు చదివి, మంచి రచయితలు అయిన వాళ్లు కూడా ఉన్నారు.

ప్రేమలేఖల్లో భావం కన్నా కూడా అర్థం కాని భాషాప్రయోగమే ఎక్కువ. ఎంత ఘనంగా రాస్తే అంత గొప్ప మరి! ప్రేమలేఖలకు నగిషీలు కూడా ఎక్కువ. రంగురంగుల పూల బొమ్మలు ఇన్‌ప్రింటుగా ఉన్న లెటరు ప్యాడ్లు, సువాసన వచ్చే పెన్నులూ, రంగురంగుల ఇంకులతో రాతలూ ... చూడగానే అదో సౌందర్యలోకంలా ఉండేది.

డిగ్రీ మొదటి సంవత్సరంలో గీతామాధురికి ప్రేమలేఖ ఇవ్వాలనుకున్నాడు ఆనందరామం. బాగా రాయడం కోసం బాగా చదివాడు. భాష మీద పట్టు, సాహిత్యం మీద అవగాహన పెంచుకున్నాడు. రంగుల పేపర్ల మీద రంగురంగుల పెన్నులతో అందంగా రాశాడు. అప్పటికి డిగ్రీ ఫైనలియర్ ... ఫైనల్ ఎగ్జామ్స్ వచ్చేశాయి. పరీక్ష ఆఖరి రోజున ఇద్దామనుకున్నాడు. కానీ, అవలేదు. ఓ అందమైన జ్ఞాపకంగా తన దగ్గరే ఉంది. ఉత్తరాల కాలంలో కొందరి ప్రేమకథలు ఇలా ముగిసేవి మరి!

✦









పెన్సిల్ గీతలే..!

చూసి చూడగానే ఎంత బాగా తీశారు ఛాయాచిత్రాలు.... నలుపు తెలుపుల తైల వర్ణచిత్రాల్ని మించి ఉన్నాయి అనిపిస్తుంది కదూ. మీరు పొగడ్తకు వాడిన వర్ణచిత్రమనే పదమే వీటికి నప్పుతుంది. ఎందుకంటే ఇవి పెన్సిల్‌తో వేసిన చిత్రాలు. మరి మోముపై జారుతున్న ఆ నీటి ప్రవాహమేంటి.. కళ్లల్లో ఆ వెలుగులేంటి.. నవ్వుల్లో ఆ జీవమేంటి... అద్దాల్లో ఆ స్పష్టతేంటి అని ఆశ్చర్యపోకండి. అదంతా కూడా నలుపు తెలుపుల మధ్య సన్నని తేడాతో తెచ్చినవే. చిత్రాల్లోని ఆ లోతు నలుపు చుక్కల్లోని చిక్కదనంలో మార్పులతో కూర్చినదే. రఫ్‌గా మనం గీసుకునే పెన్సిల్ గీతలతో ఛాయాచిత్రాల్లాంటి బొమ్మలు వేసే విన్యాసమిది. గంటలు, రోజులు, నెలలు ఒక్కో కళాఖండం రూపుదిద్దడానికి జారిపోతుంటాయి. ఒక్కో చుక్క ఒక్కో గీత వందలాది వేలాది లక్షలాది కలిసి సజీవంగా కళ్లముందుకొస్తాయి. ఈ శైలిని మలిచి ఇదో సరికొత్త ఆర్ట్ చేసేశారు కళాకారులు. నివ్వెరపరిచే ఈ కళను తమ వేలికొసల్లో నిలుపుకున్న గొప్ప కళాకారుల్లో ఫ్రాంకో క్లన్, క్యాత్ రైలీ, డియాగో ఫాజియో, పాల్ లంగ్, డిర్క్ దిమిర్క్సీ పేరు ఎక్కువ వినిపిస్తోంది.



కాఫీ ఫోన్ కవర్

అంటే కాఫీ కలర్‌లో ఉంటుందేమో అనుకోకండి. ఇది నిజంగానే కాఫీని తయారుచేసి వేడి వేడిగా మీకు అందిస్తుంది. స్మార్ట్‌ఫోన్ కేసులా కనిపించే ఇది ఎస్‌ప్రెస్సోలా పనిచేస్తుంది. బిజీ జీవితాల్ని లక్ష్యం చేసుకుని ఈ సరికొత్త కేస్‌కు రూపకల్పన చేశారు. టైం లేదంటూ కాఫీ కప్పు తీసుకోకుండా పరుపరుగున ఫోన్ తీసుకుని ఆఫీసులకు బయలుదేరే రకాలకు ఇది బాగా ఉపయోగపడుతుంది. ఏ బస్టాప్‌లోనో లేదా సీటు దొరికితే బస్సులోనో కూర్చుని కేసులోంచి కాఫీ ఒంపుకుని హాయిగా తాగొచ్చట. ఇటలీకి చెందిన 'స్మార్ట్ కె' అనే కంపెనీ మొకాసే పేరిట దీన్ని మార్కెట్‌లోకి తెస్తోంది. ఏదైనా మర్చిపోతారు కానీ ఫోన్ లేకుండా మాత్రం ఒక్క అడుగు వేయలేరనే బలహీనతను ఉపయోగించుకుని స్మార్ట్‌ఫోన్ కేసు ఐడియాతో ముందుకొచ్చిందీ కంపెనీ. ఈ కేసు హీట్ ప్రూఫ్ కావడంతో ఫోనుకు ఎటువంటి ప్రమాదం ఉండదట. అలాగే నీటికి ఒక క్యాప్సూల్, కాఫీ గింజలకు ఒక క్యాప్సూల్ ఉంటాయి. బిల్టిన్ బ్యాటరీ వీటిని కలిపి వేడి చేయడానికి కావాల్సిన శక్తినిస్తుంది. ఓ యాప్ ద్వారా దీన్ని వాడొచ్చు. బటన్ నొక్కగానే 8 క్షణాల్లో సుమారు 50-60 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల్లో కాఫీని అందిస్తుంది. ఎస్‌ప్రెస్సోలో 29 మి.లీ.ల కాఫీ షాట్ వస్తుంది. దీని ద్వారా 25 మి.లీ.ల కాఫీ తయారవుతుంది. అంతే తేడా. మిగతాదంతా సేమ్ టు సేమ్. అది రుచే కావొచ్చు.. చిక్కదనమే కావొచ్చు.. వెచ్చదనమూ కావొచ్చు. రకరకాల మొబైల్ మోడళ్లకు అనుగుణంగా మొకాసే అందుబాటులోకి వస్తోంది.



గాజు పెంకులసాక్షిగా...

పెళ్లి ప్రమాణాలు పంచ భూతాల సాక్షిగా చేయడం మామూలే. కానీ గాజు పెంకులపై నడిచి తమ బంధం దృఢత్వాన్ని చాటుకోవడం అనేది స్పెయిన్‌లో మొదలైంది. 'బ్రోకెన్ గ్లాస్' అనే కంపెనీ ఈ సేవల్ని అందుబాటులోకి తెచ్చింది. ఇలా నడవడానికి చాలా ధైర్యం కావాలని వధూవరులు ఒకరిపై ఒకరి ప్రేమను చాటుకోవడానికి ఈ సవాల్‌ను తీసుకుంటున్నారని ఆ కంపెనీ చెబుతోంది. అక్కడ ఒట్టి కాళ్లపై నడవడానికే పెద్ద ఇబ్బంది పడిపోతుంటారు. అదే గాజు పెంకులపై నడవడమంటే పెద్ద సవాలే. అయితే వీటిని ప్రేమతో ఎక్కడానికి 'ప్రేమ స్ఫటికాలు' (క్రిస్టల్స్ ఆఫ్ లవ్) అనే పేరు పెట్టారు. వీటిపై ప్రేమగా ఒకరికొకరు ఎదురు నడుస్తూ బంధాన్ని అందుకోవాలి. దాంపత్య జీవితంలో ఎదురయ్యే భయాలు, సవాళ్లు, ఒడిదొడుకులు, కష్టాలకు గాజు పెంకులు ప్రతీకలుగా నిలుస్తాయని మంచి కవరింగే ఇచ్చుకున్నా ఎక్కడ సెప్టిక్ అయ్యి మిగతా కార్యక్రమాలకు బ్రేక్ పడుతుందో, హాయిగా సంతోషంగా జరుపుకోవాల్సిన పెళ్లి వేడుక కాస్త చికిత్సలు, సూది మందులు అంటూ బాధకరంగా తయారవుతుందని కొందరి వాదన. ఎక్కడో పారబోసిన గాజుముక్కల్ని ఏరుకొచ్చి వాటికి బరువైన పేరు పెట్టి ఇలా వధూవరులకు చుక్కలు చూపించి డబ్బులు దండుకోవడం ఎంత వరకు కరెక్ట్ అనేవాళ్లున్నారు. కానీ ఇదివరకటిలా ఈజీగా వివాహాలు చేసుకోడానికి యువత ఇష్టపడటం లేదు. ఏదో ఒక ట్విస్టో లేదా ఏదో ఒక థ్రిల్లో ఉండి తీరాల్సిందే. లేకుంటే ఎట్టా గుర్తుంటాది జీవితాంతం. అయితే పెద్దగా గాయాల పాలవ్వకుండా శిక్షణనిస్తామని ఈ సాహసం చేసేందుకు అన్ని రకాలుగా తర్ఫీదునిస్తామని ఆ కంపెనీ చెబుతోంది. నిప్పుల్లో ప్రేమ నడకంటూ మరో కంపెనీ వస్తుందేమో చూడాలి.

వింత లోకం

గ్యాస్ లీకై...

నవ్వుతూ తుళ్లుతూ తిరిగే ఓ 30 ఏళ్ల యువతికి ఉన్నట్టుండి వింత రోగం మొదలైంది. ఇంటి నుంచి కాలు బయట పెడితే జ్వరం, నీళ్లు తాగినా తిండి తినినా అలెర్జీ, ఫోన్లు వాడినా విద్యుత్ పరికరాలకు దగ్గరగా ఉన్నా ఇబ్బంది. చివరకు భర్త ముట్టుకున్నా కందిపోయేది. ఆ అమ్మాయికి అసలేమైందనేది వైద్యులకు చాలా రోజులు అంతు చిక్కలేదు. చివరకు ఆమె పడక గదిలో లీక్ అవుతున్న గ్యాస్‌ను సుదీర్ఘకాలం పీల్చినందుకు అలా అయ్యిందని తేల్చారు. వినడానికి ఎంతో ఆశ్చర్యకరంగా ఉన్న ఈ పరిస్థితి లాస్ ఏంజెల్స్‌కు చెందిన నటి, గాయని పిలార్ ఒలావెకు ఎదురైంది. ఆమె కేస్ పెద్ద చర్చనీయాంశమైపోయింది. 24 గంటలూ ఆక్సిజన్ వెంటిలేటర్ల మీదే ఆధారపడుతోంది. నాలుగేళ్లుగా ఇంటికే పరిమితమైన పిలార్ ఎక్కువగా పడక గదిలోనే గడిపేది. ఏడాదిన్నర తర్వాత ఆ గదిలో ఉన్నప్పుడు ఛాతీ పట్టేసినట్టు వికారంగాను తలనొప్పి అనిపించేది పిలార్‌కు. కానీ కారణం తెలిసేది కాదు. చివరకు అదే పెద్ద రోగానికి దారితీసింది. ఓ రోజు గది శుభ్రపరుస్తుండగా మంచం కింది నుంచి ఏదో వాసన రావడాన్ని గమనించి జాగ్రత్తగా పరిశీలిస్తే మూలగా ఉన్న పైప్ తుప్పు పట్టి సన్నగా గ్యాస్ లీకు అవడాన్ని గుర్తించారు. ఈ విషయం వైద్యులకు చెప్పడంతో ఇప్పుడు సరైన చికిత్స ఇవ్వడం మొదలెట్టారు. అలా అయినా నాలుగైదేళ్లకు గానీ పూర్తిగా కోలుకోలేదట పిలార్. జాగ్రత్త మంచిది.

హరిత కేరళమ్

ఈ మధ్య కేరళలోని కలంపురుఝు నది కాలుష్య కోరల్లో చిక్కుకుపోయింది. ఆ ప్రమాదం అక్కడితో ఆగలేదు. ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ నదిలో పేరుకుపోవడంతో నీరు కలుషితమయ్యింది. ఆ కలుషిత నీరు వ్యవసాయ భూములనీ నిస్సారంగా మార్చింది. ముండేరీ పంచాయత్‌లో చోటుచేసుకున్న ఈ పరిణామాల నుంచి బయటపడడంలో ప్రభుత్వంతోపాటు ప్రజలూ ముందడుగేశారు. దాదాపు ఐదు వేల మంది భాగస్వామ్యంతో ప్రస్తుతం పూర్వస్థితికి చేరుకుంది కలంపురుఝు. ఆ వివరాలేంటో మీరూ తెలుసుకోండి.

మానవ వ్యర్థాల్లో ప్లాస్టిక్ స్థాయి రోజు రోజుకీ పెరిగిపోతోంది. ప్లాస్టిక్ వల్ల మన పరిసరాలే కాదు నీటి కొలనులు, చెరువులు, నదులు, సముద్రాలు కూడా కలుషితం అవుతున్నాయి. పంటభూములూ నిస్సారమవుతున్నాయి. ఇలాంటి వన్నీ మానవ తప్పిదాలనే స్పృహ ఎంతమందికి వుంది? పర్యావరణం పట్ల మనుషుల్లో అవగాహనా రాహిత్యం ఇటీవల కలంపురుఝుకి ప్రమాదకరంగా మారింది. కేరళలోని ముండేరీ పంచాయతీలో ప్రధాన నది కనలంపురుఝు. సముద్ర మట్టం నుండి 110 అడుగుల ఎత్తులో వున్న అయ్యప్పన్‌మలలో మొదలయ్యే ఈ నది కన్నాజు కార్పొరేషన్‌లోని ఇలయావూర్, తఝి చొవ్వ, కురువ ప్రాంతాలకి చేరుకుంటుంది. ఈ మార్గంలో మెచ్చెరి, వట్టపోయిల్, పెరింగలయి, కప్పడ్, తిల్లానూర్ ఇలా ఎన్నో ప్రాంతాల్లోనూ ఈ నది ప్రవహిస్తుంది. ఈ ప్రస్తావనంతా ఎందుకంటే.... పైన చెప్పిన ప్రాంతాల్లో ప్రజల నీటి అవసరాలతోపాటు వ్యవసాయానికీ ఈ నదే ప్రధాన ఆధారం. అలాంటి నీటి పరిరక్షణని కొందరు పక్కన పెట్టేశారు. తీర ప్రాంతాల్లో వుండే ప్రజలు ఎక్కువగా ప్లాస్టిక్ వ్యర్థాలని ఎక్కడపడితే అక్కడ పడేయడంతో ఇలాంటి వ్యర్థాలన్నీ కనంపురుఝు నదిలో గుట్టలుగా పేరుకు పోయాయి. ఇది కొన్నేళ్లుగా కొనసాగడంతో కలంపురుఝు నది దాదాపు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. నది నీరు సముద్రంలో కలిసే వీలు కూడా లేనంతలా వ్యర్థాలు పేరుకుపోయాయంటే ప్రమాదం ఏ స్థాయికి చేరుకుందో అర్థం చేసుకోవచ్చు. దాదాపు నది మొత్తం కలుషితమవ్వడంతో తాగునీటి కష్టాలూ మొదలయ్యాయి. కొద్ది కాలంలోనే కలంపురుఝు నీటి ఆధారంగా సాగుచేసే వరి మాగాణులూ నిస్సారమయ్యాయి. దిగుబడి తగ్గడానికి కారణాలు వెలికితీసే పనిలో పడ్డారు కొందరు అధికారులు. అప్పటి వరకూ తీర ప్రాంతంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాల పెనుప్రమాదం గురించి ఎవరికీ తెలీలేదు. స్థానికుల్లో నీటి కాలుష్యంపై అవగాహన కల్పించడంతోపాటు పర్యావరణ స్పృహని కలిగించేందుకు హరిత కేరళమ్ అనే ప్రాజెక్టుని ప్రారంభించింది కేరళ ప్రభుత్వం. 2016 మే 14న ప్రాజెక్ట్ పనులని ప్రారంభించారు. నీటి కలుషితాలని తొలగించడం నేలని సారవంతంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధంచేసుకున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా నదీ పరిరక్షణా కార్యక్రమాలు పేరిట అవగాహనా సదస్సులూ ప్రారంభ మయ్యాయి. చెత్తని నిరోధించడం, నీటిని శుభ్రపరిచే కార్యక్రమాల్లో ఎక్కువ మంది ప్రజలూ భాగమయ్యారు. చెలోరా నుండి కున్నూర్ కార్పొరేషన్ పరిధిలోని మనక్కార్ కండి వరకు పది కిలోమీటర్ల మేర కలంపురుఝు తీర ప్రాంతంలో వుండే చెత్తను తొలగించడంలో దాదాపు ఐదు వేల మంది చేయికలిపారు. గుట్టలుగా పేరుకున్న చెత్తని తొలగించడం అంతతేలికేం కాదు. అయితే ప్రజలు కూడా ముందుకు రావడంతో కలంపురుఝు నదిని సుభ్రపరిచే పనులు ఒక కొలిక్కివచ్చాయి. పంచాయతీలు, మున్సిపాలిటీ పరిధిలో వలంటీర్లుగా పనిచేస్తున్న వారికి చెత్తను వేరుచేసే పద్ధతులపై ప్రభుత్వం శిక్షణ ఇచ్చింది. ప్లాస్టిక్ వ్యర్థాలని పూర్తిగా నది నుంచి తొలగించారు. నీటి ప్రక్షాళన పనులతోపాటు సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై స్థానికులకు శిక్షణ అందించారు వలంటీర్లు. వ్యర్థాలని తొలగించే పనిలో స్థానికులూ పనిచేస్తున్నారు. ఒక కమిటీగా ఏర్పడిన కొందరు పరిరక్షణ కార్యక్రమాలని చూసుకుంటారు. ఇప్పటికీ నెలకోసారి పర్యావరణ సమస్యలపై అక్కడ చర్చలు జరుగుతున్నాయి. పరిష్కారాలు చేసుకోగలుగుతున్నారు. ఇది కేరళకి సంబంధించిన విషయమని తేలికగా కొట్టిపడేస్తే పొరపాటే. ఎందుకంటే ఇలాంటి వ్యర్థాలు మన ప్రాంతాన్నీ ప్రమాదంలో పడేయొచ్చు. నదులు బావుంటే పంటలు బాగుంటాయి. పంటలు బాగుంటే ప్రజలు బాగుంటారు. ప్రజలు బాగుంటే గ్రామాలు బాగుంటాయి......సమాజం బాగుంటుంది ఇలా జరగాలంటే ప్రతి ఒక్కరూ పర్యావరణంపై స్పృహని కలిగుండాలి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించగలగాలి.



ఆపాత చిత్రం

ఎండమావుల్లో బాటసారి

తెలుగు సినిమా కళామతల్లికి నిస్వార్ధ సేవలందించిన నిర్మాతలెందరో...అందులో భరణీ సంస్థ ఒకటి! పదిమంది బతకడం కోసం ఒక స్టూడియో...ఇంకా పది మందికి పని కల్పించడం కోసం ఒక సినిమా...ఇలా లాభనష్టాలతో బేరీజు వేసుకోకుండా నిరంతరం సేవలందిస్తూనే వున్నారు. తెలుగు సినిమాకి శరత్‌చంద్రఛటర్జీ మానియా పట్టుకుంది. ఆయన రచనలు అనువదించడం గొప్ప...ఆయన రచనలు చదవడం అభిరుచి. ఆయన రచనల గురించి మాట్లాడుకోవడం ఒక ఫ్యాషన్. భరణీ సంస్థ అధినేత పి.యస్ రామకృష్ణా రావు మంచి భావుకుడు చదువరి. ఒకసారి 'బడాదీది' తెనుగు అనువాదం చదవడం జరిగింది. అంతే! ఆ నవలలో పాత్రలు వెంటాడాయి. ఆమాటే భానుమతికి చెప్పాడు. భానుమతీ చదివింది. లభిమానైపోయింది. అంత గొప్పగా నచ్చేసింది. సినిమా అనుకున్న తర్వాత ఏవో కొన్ని పాత్రలూ, డైలాగులూ పాటలూ, ఫైట్సూ మామూలే. ఇవేవీ లేకుండా కథ...కథలోంచి పుట్టుకొచ్చిన పాత్రలూ...ఆ పాత్రల మధ్య మానసిక సంఘర్షణ మనసుని హత్తుకున్నాయి. బడాదీదిని సినిమా తీయాలనే నిర్ణయించుకున్నారు.

భానుమతి ఆ సినిమాకి పేరు 'బాటసారి' అయితే బావుంటుంది అని చెప్పింది. అలా సినిమాకి నామకరణం జరిగింది. బాటసారి పేరు బావుంది. శరత్‌చంద్ర నవలని సినిమాగా ఎవరైనా తీస్తున్నారంటే అప్పట్లో అదో క్రేజు. దానిక్కారణం శరత్ కథల ఆధారంగా వచ్చిన చిత్రాలు వరుస విజయాలు సాధించడమే. ఆ కథల జోలికి వెళ్ళాలంటే సముద్రాల వారికే ఎక్కువ హక్కుంటుంది. ఎందుకంటే శరత్ రచనల ఆధారంగా వచ్చిన చాలా సినిమాలకి పనిచేశాడు. శరత్ భావుకతని అర్ధం చేసుకున్నవాడు. పైగా జగమంత కుటుంబంతో ఏకాకి జీవితం గడుపుతున్నవాడు. ఎక్కువ సమయం సినిమా కోసం కేటాయించగలడు. అందుకే రామకృష్ణ బాటసారి కథా కథనాల విషయం మన సముద్రాల వారు చూసుకుంటారని భానుమతితో చెప్పాడు. భానుమతి కూడా సినిమాలో క్రీమ్‌నే కోరుకుంది. కథ, మాటలు అయిపోయాయి. బౌండుబుక్ రామకృష్ణ చేతిలో పెట్టారు సముద్రాలవారు. ఆ బౌండ్ బుక్కు చూసి ఇదేమిటి ! మన సినిమా అంతా కలసి ఇంతేనా? అన్నాడు రామకృష్ణ. అందుకు భానుమతి ఇంతే కాకపోతే చాటభారతమంతుంటుందా...ఇది బాటసారి... ఏదో చుట్టంచూపుగా కనిపించి కదిలిపోయే కథ. అంతే వుంటుంది. 'అవతల నాగేశ్వరరావు బిజీ అవుతున్నట్టున్నాడు కబురుచెయ్యండి. తర్వాత మళ్ళా దొరకడు. మరో హీరోతో ఈ సినిమా తీయలేం!' అని సలహా ఇచ్చింది. అక్కినేనిని డేట్స్ కోసం సంప్రదించారు. అప్పుడు నిజంగా బిజీగా వున్నాడు. సినిమా చెయ్యలేను అనే గుండెధైర్యం లేదు. కమిట్ అయిన సినిమాలు చెయ్యకపోతే నిర్మాతలు వూరుకోరు. ఇది అక్కినేని బాధ! 'ఏమిటి! మన నాగేశ్వరరావు ఏ విషయమూ చెప్పడూ?' అన్నారు రామకృష్ణ. 'ఏం నాగేశ్వరరావు మీలాగా నాలాగా ఖాళీగా కూర్చున్నాడా? ఇప్పుడు బాగా బిజీ అయిపోయాడండీ...అందాకా పాటలు పూర్తిచేద్దాం... వేణుగార్ని పిలిపించండి' అంది భానుమతి. మాస్టర్ వేణుని పిలిపించారు.

మెలోడీ మాస్టర్...

బాటసారిలో అన్ని పాటలూ ఆణిముత్యాలే! మ్యూజిక్ సిట్టింగ్స్ అంటే ప్రత్యేక పాట సిద్ధమవుతుండగానే కూనిరాగాల ప్రహసనం ప్రారంభమౌతుంది. స్వరకర్త ట్యూన్లు హమ్ చేస్తే చాలు. అందుకుంటుంది. తనకి నచ్చినట్లయితే హార్మోనియంతో పాడుతుంది. నచ్చకపోతే ఆదిలోనే తుంచిపారేస్తుంది. 'బాటసారి'లో పాటలకు మాస్టర్ వేణు ప్రాణం పోశారు. 'ఓ బాటసారీ! నను మరువకోయి...మజిలీ ఎటైనా మనుమా సుఖానా' భానుమతి పాడిన పాట. ఇప్పటికి అరవై ఆరు సంవత్సరాలవుతున్నా మరిచి పోగలమా? అలాగే భానుమతి, జిక్కి పాడిన, 'కనులకుతోచి చేతికందదని.... ఎండమావులున్నై...' ఎంత గ్పొప్ప అర్థవంతమైన పాట... మూడవది 'లోకమెరుగని బాల....దాని పోకడ చిత్రము చాలా' భానుమతిపాట మధురమైనపాట. అలాగే మరోపాట 'కనేరా కామంధులు...వినేరా ఉన్మాదులు...ఈలోకులు' ఈ పాట కూడా భానుమతిగారే పాడారు. ఈ పాటల్లో స్వరం, సాహిత్యం రెండూ పడుగు పేకల్లా అల్లుకుపోయాయి.

అదీ గొప్పతనం! మాస్టర్ వేణు కూడా గొప్ప మాధుర్య ప్రధానమైన పాటలందించారు. ఆయన్ని తెలుగు ప్రేక్షకులు మరిచిపోరు.

బాటసారి షూటింగ్

బాటసారి షూటింగ్ మొదలైంది. ఇప్పటిలా ఒక సినిమాకు పది షెడ్యూల్లూ... సంవత్సరం పాటు సమయమూ వుండేదికాదు. పైగా భరణీ వారికి స్టూడియో వుంది. పర్మినెంట్ సిబ్బందీ వుంది. ఇక సమస్యేముంటుంది? అద్భుతమైన పాటలు..సుందరం ఫొటోగ్రఫీ...సినిమాని చాలా అందంగా తీసే నేర్పరి. క్లోజప్‌లో తారలు లడ్డూల్లా కనిపించేవారు.

ఇదీ కథ

సురేంద్ర (అక్కినేని) లండన్‌లో చదువుకొని వస్తాడు తనకోపెద్ద జమీందారీ వుంటుంది. దివాన్‌గా లింగమూర్తి ఆ జమీందారీ ఎలా సొంతం చేసుకోవాలా అని కుట్రలు పన్నుతూ వుంటాడు. రామన్న పంతులు జమీందారు. అతని రెండవ భార్య సూర్యాకాంతం. 'బాటసారి' సినిమాలో సూర్యాకాంతం చాలా మంచి పాత్ర చేసింది. లండన్ నుంచి తిరిగొచ్చిన సురేంద్రకు పుస్తకమే ప్రపంచం..లోకం తెలియని పసివాడు. బయటి ప్రపంచం గురించి ఏమీ తెలియని అమాయకుడు. ఇల్లూ....పుస్తకం ...అదే ప్రపంచం... జమీందారీ వ్యవహారాలు పట్టించుకోమని ఎంతచెప్పినా సురేంద్ర తలకెక్కదు. తన ప్రపంచం తనది. పెళ్ళి చేస్తే వ్యవహారం కుదుటపడుతుందని ఆలోచిస్తారు. ఆ మాటలు విన్న సురేంద్ర చెన్నపట్నం వెళ్ళిపోతాడు. చెన్నపట్నంలో అప్పారావు కుటుంబం(బి.ఆర్ పంతులు)వారు. ఆయన కూతురు మాధవి (భానుమతి)కి చిన్నప్పుడే వైధవ్యం ప్రాప్తిస్తుంది. చిన్న కూతురు ప్రమీల. ఈ పాత్రని బేబీ శశికళ చేసింది. చాలా గడుసమ్మాయి. చదువంటే అశ్రద్ధ. ట్యూటర్ కోసం వెదుకుతుండగా సురేంద్ర తారసపడతాడు. ప్రమీలకి ట్యూషను చెప్తుంటాడే గానీ తన ప్రపంచం వేరు. ఎక్కడో ఆలోచిస్తుంటాడు. అది మాధవి గమనిస్తుంది. మాయామర్మం తెలియని మనసు. ఆకలైనా అడగలేని పసిబిడ్డ మనస్తత్వమని గ్రహించిన మాధవి అవసరమైన సపర్యలు చేస్తూవుంటుంది. సురేంద్ర మాధవి

జీవితాంతం గుర్తుంచుకుంటాను

ఓ రోజు భరణీ స్టూడియోలో సాయంసంధ్య సమయంలో చెట్లనీడన కూర్చుంటూ.. బాటసారి కథ వినిపించారు రామకృష్ణగారు. అక్కినేని సొంతం విన్నారు. ఏదీ శ్రమ అనుకోకుండా మళ్ళీ చెప్తారా? అని అడిగారు. ఇలా అడిగేవాళ్ళంటే దర్శకులకి చాలా ఇష్టం. మనసుపెట్టి వింటున్నట్లు లెక్క. చాలా డీప్‌గా వెళ్ళిపోయారు. రామకృష్ణగారు కథ చెప్పేవిధానం చూసి భానుమతి ఆశ్చర్యపోయారు. 'ఏందయ్యో...ఏదో పూనకం వచ్చినట్టు చెబుతున్నావు'. ఇందమాదిరి ఎనక్కూసొల్లలమే!' నువ్వు కథ చెప్పినప్పుడు ఇలా నాకెందుకు చెప్పలేదని చమత్కరించింది. కథ విన్న తర్వాత అక్కినేని ట్రాన్స్‌లోకి వెళ్ళిపోయారు. తేరుకొని "రామకృష్ణగారూ! ఈ సినిమా ఎంతవరకూ వసూలు చేస్తుందో నాకు తెలీదుగాని చరిత్రలో నిలిచిపోతుంది. మరీ ముఖ్యంగా నా జీవితంలో నాకిష్టమైన సినిమాల్లో మొదటి సినిమాగా నిలబడిపోతుందేమో ఆలోచించాలి ఇంకా సినిమా పూర్తవ్వలేదు కదా. అవుట్ పుట్ వచ్చాక అప్పుడు చెబుతాను!" అంటూ కితాబు ఇచ్చాడు. భానుమతిపొంగిపోయింది. తనకెలా నచ్చిందో ...హీరోకీ అలాగే నచ్చింది! బాటసారి చిత్రం మీద ఆశలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఆ రోజుల్లో ముందే సంభాషణలూ రిహార్సల్సూ వుండేవి కదా. ఆ రిహార్సల్స్ చేస్తున్నప్పుడు ఓ డిఫరెంట్ అక్కినేనిని చూశారు.

మోడువారిన జీవితం గురించి ఆలోచిస్తుంటాడు. బాధపడతాడు. పిచ్చిగా ప్రేమిస్తాడు. కానీ ఏ విషయమూ బయటికి చెప్పలేడు. మాధవి పరిస్థితీ అదే బంగారంలాంటి మనసు. కళ్ళద్దం విరిగిపోయినా..పగిలిన అద్దంతో చదువుకొనే పిచ్చివాడు అందుకే అన్నీతానై సురేంద్రని పసిబిడ్డలా చూసుకుంటుంది. తన మోడు బారిన జీవితంలోకి వసంతంలా వచ్చిన సురేంద్రని ఆరాధనాభావంతో చూస్తుంది. ఇది మనోరమ (దేవిక)కి నచ్చదు. మాధవి సోదరుడు జె.వి రమణమూర్తి కూడా జీర్ణించుకోలేక పోతాడు. దేవిక భానుమతితో కుటుంబం, పరువూ ప్రతిష్ఠలన్నిటినీ దృష్టిలో వుంచుకొని చెలియలికట్టు దాటవద్దని హెచ్చరిస్తుంది. భానుమతి మనసు గాయపడుతుంది. తన మూలంగా అన్నెంపున్నెం ఎరుగని ఒక పవిత్ర స్నేహమూర్తి బాధపడటం చూసి ఓర్వలేక తిరుగుముఖం పడతాడు. తన ప్రయాణం ఎక్కడికో అర్థంకాదు. ఒక గమ్యం లేదు. అపస్మారకస్థితిలో శూన్యంలోకి నడుస్తున్న సురేంద్ర యాక్సిడెంట్‌కి గురవుతాడు. దివాన్ ఇంటికి తీసుకు వస్తాడు. కోలుకున్న తర్వాత పెళ్లి చేసేస్తారు. అతని భార్యగా వచ్చిన జానకి ఆయన మానసిక స్థితిని చూసి ఆందోళన పడుతుంది.

సురేంద్ర ఇల్లు విడిచి వెళ్ళిపోయిన తర్వాత మాధవి తన బతుకంతా శూన్యంగా భావిస్తుంది. ఇంటి బాధ్యతలు దేవికకి అప్పగించి, తనకు భరణంగా ఇచ్చిన ఇంట్లో వుండటం కోసం బయలుదేరుతుంది. ఆ ఇంటిని జమిందారు జప్తుచేశారని తెలిసి మండిపడుతుంది. జమీందారు సురేంద్రని మాధవి కలవకుండా అడ్డుపడతాడు దివాన్. లోకంతెలియని పసివాడిగా తిరుగాడిన సురేంద్ర ఒక జమీందారు అని తెలిసి మదనపడుతుంది. 'మాధవి' ఇంటిని జప్తు చేశారన్న విషయం రికార్డుల ద్వారా తెలుసుకున్న సురేంద్ర తన ఆరోగ్యం సహకరించకపోయినా గుర్రం మీద మాధవిని వెతుక్కుంటూ బయలుదేరుతాడు... ఇసుక తుఫాను....అప్పుడే మాధవి తారస పడుతుంది. ఆమె చేతిలో మరణిస్తాడు. మాధవి కూడా తనువు చాలిస్తుంది!. ఇదీ కథ...స్క్రిప్ట్‌లోవున్న ఒక్క అక్షరం మార్చకుండా చిత్రీకరించారు.

అక్కినేనికి అగ్రతాంబూలం

ఈ చిత్రంలో అక్కినేని నటన నభూతో న భవిష్యతి. అంతగొప్పగా చేశాడు. తన సినిమాల్లో మూడొందల సినిమాల్లో అగ్ర తాంబూలం బాటసారికి ఇస్తానంటాడు. ఈ సినిమా తమిళ్‌లో 'కన్నల్‌నీర్'గా విడుదలైంది. రెండు భాషల్లోనూ సినిమా గొప్పగా వుందని ప్రశంసలైతే వచ్చాయి కానీ సొమ్ముచేసుకోలేదు. ఈ సినిమాకి 'ఎండమావులు' అని ముందు పేరుపెట్టారు. తర్వాత బాటసారిగా మార్చారు. ఈ సినిమాలో "ఓ బాటసారీ! వినరా ఉన్మాదులలై ఈ లోకులూ, కునుకు దోచి చీకటికందని ఎండమావులన్నె ..." ఈ పాటలకి తగిన స్వరంలో ఆలపించారు పి.యస్, రామకృష్ణ భానుమతి. ఆ రోజుల్లో లక్షల నష్టాన్ని ఇష్టంగా స్వీకరించారు. వీరి గుండెధైర్యాన్ని అభినందించాలి. అయితే ప్రాణమున్నంత వరకూ భానుమతి, అక్కినేనిలకు ఇష్టమైన కష్టమైన సినిమా బాటసారి. ఆ తృప్తి అనంతమైంది!? బాటసారి లాంటి చక్కని దృశ్యకావ్యాన్ని అందించిన వీరందరూ ధన్యులు.

- ఇమంది రామారావు

9010133844

వెండి మంటలు

రాత్రి నల్లటి ఆకాశంపై
వెన్నెల వెండి సంతకం పెడుతోంది
మబ్బు ముసుగుల్ని తొలగించుకున్న
నక్షత్రాలు నడుస్తూ పాదాల కింద
నిశ్శబ్దాన్ని పలకరిస్తున్నాయి
గొంతులో అగ్నిశిఖల్ని దాచుకున్న కొంగలు
రెక్కలతో మబ్బుల్ని మందలిస్తున్నాయి
నిద్రపోతున్న తీరాన్ని సముద్రం
మృదువుగా ముద్దులు పెడుతోంది
పడుచు పెదవులు అందమైన అనుభవాలను
మధురంగా పలవరించుకుంటున్నాయి
గాయపడ్డ కుక్కలు మొరుగుతూ
చెవుల్లో వరదల్ని సృష్టిస్తున్నాయి
కాంతిలేని కళ్లల్లో జీవంలేని వెలుగుకోసం
కన్నపేగు కలవరపడుతోంది
చందమామ దగ్గర గోరుముద్దలు తిందామని
చిన్నారి శిశువు చెంగున ఎగిరిపోయింది.

- బొబ్బిలి శ్రీధరరావు
76600 01271

ఆహ్వానం

మీ కవితలు పంపాల్సిన చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4,
ఆకుల వారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ. -520002.
మెయిల్ అడ్రస్
:snehaweekly.praja@gmail.com

కవిత్వం

చదువు శరవేగంతో ఒక చోట

నేలపై పరుగులుతీస్తుంది
రాకెట్ వేగంతో ఒక చోట
నింగికి నిటారుగా ఎగుస్తొంది
పరుగెత్తే చదువును పట్టుకుని
అక్షరాభ్యాసానికి నా కుమారుణ్ణి
సమాయత్తం చేశాను!
యూనిఫారం నీలివర్ణ ఆకాశంపై
ధవళ వర్ణ మేఘంలా వుంది
బిగిసిన టైను విప్పికట్టి
వొరుసుకున్న బూట్లను వొదులు చేశాను
పాఠశాలకు హారం వేసిన వాడిని
జుంటితేనె కబుర్లతో వూరించాను!
ప్రాథమిక తరగతిలో కూర్చోబెట్టి
పక్కన నక్కి నా చూపులు
పరీక్షగా చూస్తున్నాయి
వాడిది ఏడుపు లాంటి కేకో
అరుపులాంటి ఏడుపో
క్లాసు రూం వులిక్కిపడింది
ఏడ్పులు పెడబొబ్బలు కేకలు
ఉపాధ్యాయుడికి సర్వసాధారణమై
బ్లాక్ బోర్డుపై చాక్‌పీసు
సహజ ధోరణిలో సాగిపోతూవుంది
పిల్లల ముఖాలు బిక్క ముఖం వేశాయి
చూపులు చిగురాకుల్లా వణుకుతున్నాయి
ఐదు సంవత్సరాలుగా గడ్డకట్టిన కన్నీరు
చెంపలపై పారి నోట్లోకి జారి
జలపాతమైంది!
బంధించిన పేగుబంధం
నన్ను వాడిముందు నిలబెట్టింది
శ్రుతి మించిన ఏడ్పు అమ్మ అమ్మంటూ
ఎత్తుకోమని చేతులు చాపింది
బడికూడా ఒక అమ్మే అంటూ
అ ఆ ఇ ఈలు రాసిచ్చారు మాస్టారు
ముగ్గులోకి దించటానికి ముందుగానే దిద్దాను
ఆపై యిష్టాయిష్టాంగా వాడు దిద్దాడు
పిల్లలు చుట్టూచేరి ఆడించారు
రంగురంగుల బొమ్మలు చూపి నవ్వించారు
నా అర్ధాంగికి యిప్పుడు ఇద్దరు బిడ్డలు
నేనూ మా వాడూ
ఇద్దరం ఒకటో తరగతి
సాయంత్రం నాచేతిని వాడు
వాడి చేతిని నేను మార్చి మార్చి పట్టుకుని
వదలకుండా ఇంటికి చేరాము!
మర్నాడు ఉదయం యిద్దరం ముస్తాబై
పదపదమన్నాను
సంచిలోకి తొంగిచూసి పలక అన్నాడు
పర్యవేక్షిస్తున్న అర్ధాంగి ఫక్కున నవ్వింది
బిడ్డ దారిలో పడ్డాడు
తండ్రి దారితప్పి పడ్డాడు
ఇదిగో పలక అంటూ ఇద్దరు బిడ్డల తల్లి
అర్ధాంగి అందించింది!

అడిగోపుల వెంకటరత్నం
9848252946

సముద్రం లోతు తక్కువే..!

సముద్రాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు వరల్డ్ ఓషన్స్ డేని మొట్టమొదటగా 1992లో నిర్వహించారు. 2008లో ఐక్యరాజ్యసమితి దీన్ని అధికారికంగా ఆమోదించింది. అప్పటి నుండి ప్రతి సంవత్సరం జూన్ 8న వరల్డ్ ఓషన్స్ డే నిర్వహిస్తున్నారు.

- భూమీద అతిపెద్ద సముద్రం పసిఫిక్ మహాసముద్రం.. భూమీద 30శాతం విస్తరించి ఉంది
- సముద్రాల్లో గుర్తించిన ప్రతి ఒక జీవజాతికి మరో మూడు జీవజాతుల ఉనికి వెలుగులోకి రావాల్సి ఉంది. అంటే మనకు తెలిసిన సముద్ర జీవుల సంఖ్య 2,50,000 అంటే కనీసం 10 లక్షల జాతుల సముద్ర జీవులున్నాయని శాస్త్రవేత్తల అంచనా.



- మహా సముద్రాల అడుగు భాగాన కూడా నదులు, సరస్సులు, చిన్నపాటి సముద్రాలుంటాయి. వాటికి కెరటాలు కూడా వస్తుంటాయి.
- భూగోళంలో అత్యంత పెద్దదైన జలపాతం నిజానికి మహాసముద్రంలో ఉంది. గ్రీన్‌ల్యాండ్-ఐస్‌ల్యాండ్ మధ్యలోని సముద్రం అడుగు భాగంలో ఇది ఉంది. డెన్మార్క్ స్ట్రెట్ క్యాటరాక్ట్‌గా పిలిచే ఇది 11,500 అడుగుల దిగువకు జాలువారుతుంది. నయాగరా జలపాతం కంటే 2 వేల రెట్లు అధిక నీరుని ఇది తీసుకెళుతుందని అంచనా.



- సముద్రాల్లో ఎక్కువ కార్బన్ ఉద్గారాలు పేరుకుపోతుండడంతో సముద్రపు నీరు ఎక్కువ ఆమ్లంగా మారుతున్నాయి. సముద్ర జీవాలకి ఆవాసం లేకుండాపోతోంది.
- ప్రపంచవ్యాప్తంగా మహాసముద్రాల్లో షార్క్స్ 400 మిలియన్ సంవత్సరాల నుంచి నివసిస్తున్నాయి.
- జీవజాలం మనుగడ సాగిస్తున్న ప్రాంతంలో 99శాతం సముద్రాలే..
- ఒకవేళ సముద్రాల్లో వున్న నీరంతా గడ్డకట్టినట్లైతే... సముద్రాల 66మీ. ఎత్తుకు పెరుగుతాయి.
- 'మన సముద్రాలు మన భవిష్యత్తు' థీమ్‌తో 2017 వరల్డ్ ఓషన్స్ డేని నిర్వహించనున్నారు.
- సముద్రాల్లో 2 కోట్ల టన్నుల బంగారం ఉందని ఓ లెక్క. అయితే దీన్ని వెలికితీయడానికి అయ్యే ఖర్చు ప్రస్తుత సాంకేతికత, పరిస్థితుల్లో దాని విలువతో పోలిస్తే చాలా ఎక్కువ.



- మనం పీల్చే సగం ఆక్సిజన్ సముద్రంలోని సీవీడ్స్, మొక్కల నుంచి విడుదలవుతున్నదే. ఫైటోప్లాంక్టన్ అనే ఏక కణ జీవులు ఎక్కువగా ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంటాయి.
- భూమిని 71 శాతం సముద్రాలు కప్పేసినా వాటి లోతు మాత్రం సరాసరిన 4-2 కిలోమీటర్లే. అంటే భూమ్మీద ఉన్న మొత్తం నీటిని సముద్రాలు, ధ్రువాల వద్దనున్న మంచు, భూగర్భ జలాలన్నింటినీ కలిపితే 1385 కి.మీ.ల వ్యాసమున్న గోళం తయారవుతుంది. భూమి దానికి తొమ్మిది రెట్లు ఉంటుంది.
- రెండు కోట్ల సంవత్సరాలకు పూర్వం అట్లాంటిక్ మహా సముద్రం లేదు. భూఫలకాల ప్రయాణంతో ఉత్తర, దక్షిణ అమెరికాలు దూరం జరిగి ఈ మహా సముద్రానికి దారి దొరికింది. ఇదిలాగే కొనసాగి అట్లాంటిక్ మహా సముద్రం మరింత పెద్దదవుతుందట. పసిఫిక్ మహా సముద్రం మాత్రం తగ్గిపోతుందట.



కథ

కూతురైనా..కొడుకైనా ఒక్కటే

అమూల్యాచందు కప్పగంతు

9059824800

"నాన్న ఇదిగో నాకు కావల్సిన పుస్తకాల లిస్టు. ఇవి తెచ్చిపెట్టవా ప్లీజ్ అంటూ లిస్టును తండ్రి శంకర్ చేతిలో పెట్టింది కూతురు శ్యామల. ఎగాదిగా లిస్టు వైపు చూసి పరాపరా చింపేసాడు.

పుస్తకాలు కావాలా నీకు.. చదివి ఎవరిని ఉద్ధరించడాని కట పో ఇక్కడి నుంచి. గట్టిగా అరిచేసరికి కళ్లల్లో నీళ్లు కుక్కుకుని తల్లి సౌమ్య దగ్గరికి పరిగెత్తింది. పేరుకు తగ్గట్టే సౌమ్యురాలు... "ఎందుకు తల్లి. ఏడుస్తావ్ ఊరుకో నేనున్నా కదా నీకు. పదా బజారుకు వెళ్లి కావల్సిన పుస్తకాలు తెచ్చుకుందాం." సౌమ్యకు, శ్యామలకు ఇది మామూలే. శ్యామలకు తండ్రంటే వల్లమాలిన అభిమానం. నాన్నతో కబుర్లు చెప్పాలని, సాయంత్రం పూట షికారుకెళ్లాలని, సినిమా చూడాలని, ఐస్‌క్రీం తినాలని ఉంటుంది.

కానీ ఆయనకు కూతురంటే అస్సలిష్టం ఉండదు. కూరలో కరివేపాకును చూసినట్టు చూస్తాడు. చేతి మీద వాలిన పురుగును దులపరించినట్టు శ్యామలను దులపరించేస్తాడు. తనంటే ఎందుకంత కోపమో అర్థంకాదు. ఏరోజుకైనా మారతాడని ఒక్కసారైనా దగ్గరకు తీసుకుని తల మీద చెయ్యేసి నిమురుతాడని, నుదుటి మీద ముద్దు పెట్టుకుని నా బంగారు తల్లి అంటాడని ఎదురుచూస్తూనే ఉంది. కాని రోజురోజుకు తనంటే ఇష్టం పెరగకపోగా కష్టంగా, భారంగా చూడ్డం మొదలెట్టాడు.

ఆ కోపం, ఆ ఉక్రోషం, ఆ అసహనం, ఆ చిన్న చూపు సౌమ్యకు మాత్రమే తెలుసు. కూతురు పుట్టిందని, కూతురంటే భారీ ఖర్చుని దూరం పెడుతున్నాడని. శ్యామలకు మాత్రం అలాంటి అపోహలేమీ కలగకుండా జాగ్రత్త పడుతుంటుంది. ఎప్పటికప్పుడు సమయానుకూలంగా ఏదో ఒకటి సర్ది చెప్పుకొస్తోంది. ఇన్నేళ్ల నుంచి శ్యామల కూడా అమ్మ మాట వింటూనే ఉంది. మీ నాన్నకు ఏదో అర్జెంటు పని పడినట్టుంది. అందుకే అలా కసురు కుంటున్నారు. పద మనంవెళ్దాం అంటూ కూతుర్ని బయటికి తీసుకెళ్లింది. అమ్మా! నువ్వు మాట దాటేస్తున్నావ్ కానీ. నాన్నకు నేనంటే ఎప్పుడూ ఇష్టం ఉండదు. చూస్తున్నాగా నాకు ఊహ తెలిసిన దగ్గర్నుంచి ఇలాగే తిడుతున్నారు. ఏ రోజైనా ప్రేమగా దగ్గరకు తీసుకున్నారా, అందులోనూ నా ఈ అవిటితన మంటే నాన్నకు చిరాకు. దగ్గరకు కూడా రానివ్వరు. ఎంతో బాధతో, ఆర్ధ్రత నిండిన హృదయంతో అంటుంటే సౌమ్య మనసు బాధపడింది. సర్లే వదిలేయమ్మా నాన్న గురించి. నేనున్నాగా అంటూ ఓదార్చింది. అలా మాటల మధ్యలోనే వెళ్లి పుస్తకాలు కొనుక్కుని సరదాగా ఐస్‌క్రీములు తిని ఇంటికి బయల్దేరారు. సర్వీసు ఆటోలో ఎక్కి కూర్చున్నారిద్దరూ. అప్పటికే అందులో ఇద్దరు పాసింజర్లు ఉన్నారు. తండ్రికూతుళ్లు వారు. శ్యామల వాళ్లు కూడా ఎక్కి కూర్చున్నారు. "చిట్టితల్లి నువ్వేం చదవాలను కుంటున్నావో అది చదువుకో. ఎంత ఖర్చైనా నేను భరిస్తాను సరేనా. నువ్వేం కంగారుపడకు కావల్సిన పుస్తకాలు వగైరా ఆర్డర్ వెయ్యి. ఈ నాన్న సదా నీ సేవలో ఉంటాడు. ఓకే నా తల్లి. అనేసరికి అలాగే నాన్న నేను సైంటిస్ట్‌ని అవుతాను. అంటూ వాళ్ల నాన్నకు చెప్తోందామె." ఆ తండ్రికూతుళ్ల సంభాషణ విన్న శ్యామల మనసులో మళ్లీ దిగులు మొదలైంది. సౌమ్య అది గమనించింది.

శ్యాము నువ్వు బాధపడకు. నాన్న మారతారు అది నీ చేతిలోనే ఉంది. శాంతంగా ఉంటే చాలు. కాలమే అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తుంది. ఎందుకు చెబుతున్నానో అర్థం చేసుకో. అంది సౌమ్య. అలాగే అమ్మా. కాని నాకూ ఆశలు ఉంటాయి కదమ్మా. నాన్న నాతో మాట్లాడాలని, ఆడుకోవాలని, షికారు తీసుకెళ్లాలని కాని ఎదురుగా నాన్నను చూస్తూ నేనెలా నిశ్శబ్దంగా ఉంటాను చెప్పమ్మా నీళ్లు తిరుగుతున్న కళ్లతో. నేను నీ తల్లిని కాదు. స్నేహితురాలిని. నీకు ఎక్కడికెళ్లాలనిపించినా నేను తీసుకెళ్తాను. సరేనా అంది. "బాబూ. ఇదిగో ఈ పక్కనే ఆపు. మా స్టాప్ ఇదే. ఆటోలోంచి దిగి ఇంటి దారి పట్టారు. దారంతా శ్యామలకు ధైర్యం నూరిపోసింది సౌమ్య. ఇంటి గుమ్మంలోకి వచ్చేసరికి లోపల నుంచి ఇద్దరి నవ్వులు వినిపించాయ్. ఎవరివా అంటూ లోపలికెళ్లారు. శంకర్, రామారావుల ఇకఇకలు, పకపకలు. వీధిగుమ్మం వరకూ వినిపిస్తున్నాయి. రామరావు శంకర్ స్కూల్ ఫ్రెండ్. ఎన్నో ఏళ్లకు కలుసుకునే సరికి అప్పటి సంగతుల్ని గుర్తు చేసుకుని నవ్వుకుంటున్నారు. సౌమ్య, శ్యామల రాకను గమనించి నవ్వుల్ని ఆపారిద్దరూ. ఏం అన్నయ్యా. బాగున్నావా! ఏంటి చాలా రోజులకు కాదు ఏళ్లకు కనిపిస్తున్నావ్. మమ్మల్ని మర్చిపోయారుగా మీ భార్యభర్తలిద్దరూ. అంది సౌమ్య..అదేం లేదమ్మా. ఎందుకు మర్చిపోతాను. ఆఫీసు వర్కుతో బిజీ బిజీ. అంతే హే సౌమ్య ఎలా ఉన్నావురా. అంటూ హుషారుగా పలకరించేసరికి. బాగున్నా మావయ్యా అంది. ఎలా చదువుతున్నావు, ఏంటి? బాగా చదువుతున్నాను. 10వ తరగతికి పబ్లిక్ పరీక్షలకు బాగా ప్రిపేర్ అవుతున్నా. ఎంసెట్ కోచింగ్ కూడా తీసుకుంటు న్నా. మంచి మార్కుల కోసం నెట్‌లో మ్యాటర్‌ని గ్యాదర్ చేసి నోట్స్ ప్రిపేర్ చేసుకుంటున్నా చెప్పింది సౌమ్య. శ్రీను ఎలా ఉన్నాడు..బాగా చదువు తున్నాడా. ఎగ్జామ్స్‌కి బాగా ప్రిపేర్ అవుతున్నాడా మావయ్యా...? తిరిగి

అడిగింది. కూతురు అలా అడిగేసరికి అంతెత్తున లేచాడు శంకర్.. ఏం... చిన్నా, పెద్దా లేదా నీకు.! నోటికొచ్చింది వాగుతున్నావ్. శ్రీను గురించి నువ్వడుగుతున్నావా. పో లోపలికి వాడికేం బాగా చదువుతాడు. ఎంతైనా మగపిల్లాడు. నువ్వు పో లోపలికి అనేసరికి ఒక్కసారిగా ఉలిక్కిపడి లోపలికి పరుగు లాంటి నడకతో వెళ్లిపోయింది. ఏంర్రా శంకర్ అమ్మాయిని అలా కసురుకున్నావ్.? పాపం ఏం అందని, నీకేం తెలీదు నువ్ ఊర్కోరా. రామారావు నోరు నొక్కేసాడు. ఏ సౌమ్యా ఇద్దరికీ భోజనం వడ్డించు. త్వరగా బయటికి వెళ్లాలి ఇద్దరం. భర్త గట్టిగా అరిచేసరికి వస్తున్నానండీ అంటూ గబగబా బయటికి వచ్చి ఇద్దరికీ అన్నం వడ్డించింది. రామారావు నిశ్శబ్దంగా ఉన్నాడు. ఏంర్రా ఇలా తయారయ్యావ్. నువ్వు మా శంకర్‌వేనా ఇలా అరిచేస్తున్నావ్ ఏంటి అందరి మీదా.?

ఏం చేయమంటావ్ మరి. ఇంట్లో ప్రశాంతత లేదురా ఆవేదన వ్యక్తం చేశాడు. నీకేమైందిరా చక్కని చెల్లెమ్మ, గొంతెమ్మ కోర్కెలు కోరని బంగారు కూతురు ఇంకేంటి నీక్కావల్సింది అన్నాడు. బంగారు కూతురా ఇదా నా పాలిట గుదిబండ. ఒక్కసారిగా అన్న ఆ మాటకు రామరావు షాక్ తిన్నట్టు నిశ్శబ్దంగా ఉండిపోయాడు మారుమాటాడకుండా. ఏంటే నీ కూతురు శ్రీను చదువు గురించి అడుగుతోంది. అసలు దీన్ని చదువు మాన్పించు ప్రశ్నించడం మానేలా నోరు అదుపులో పెట్టు హుంకరించాడు. వాడు మగపిల్లాడే చక్కగా చదువుతాడు వాడికేం అంటూ శ్రీను గురించి గర్వంగా చెబుతున్నాడు శంకర్ ... అమ్మా శ్యామూ. చారుగిన్నె పట్టుకురా తల్లి పిలుపుకు గిన్నె తీసుకెళ్లింది. చారు పొయ్ అంటూ అన్నం కలుపుకుంటూ చేతికి అడ్డొచ్చిన కరివేపాకును బొటనవేలికి, చూపుడువేలుకు మధ్య పైకెత్తి చూశావా.. ఇది చూశావా.. ఇది నీ కూతురు. అంటూ చారులోని కరివేపాకు చూపిస్తూ కింద పడేసాడు. ఎంత చదివినా, కట్నం ఇచ్చి వేరే పంపాల్సిందే తెలుసా నీకు. కన్నది ఒక కూతుర్ని. ముదనష్టాలన్నీ నాకే తగిలాయి. గొణుక్కుంటున్నట్లు గట్టిగానే అన్నాడు శంకర్. ఓరే ఆపరా. ఇంక చెప్పావ్ కాని ఏం తెలుసురా నీకు నా కొడుకు గురించి. సౌమ్య తోటోడేగా వాడు. కాని తెల్సా నీకు వాడి అసలు రంగు. వాడు చెడు స్నేహాలకు అలవాటు పడ్డాడు. నాకు కనబడకుండా సిగరెట్టు తాగడం, సెల్స్‌లో చాటింగ్. తెల్సా వాడెంత పాడయ్యాడో. ఛస్తున్నా రా నేను. వాడిని ఎలా మార్చాలా అని. నీ కూతురు బంగారం. అనవసరంగా నువ్వు ఆడపిల్ల అని వంక పెట్టి తిడుతున్నావ్ తప్పురా. నీ కన్నబిడ్డరా అనేసరికి చిర్రెత్తుకొచ్చింది శంకర్‌కి. ఆడపిల్ల ఇక్కడిది కాదు కదరా. వెళ్లిపోయేదేగా నాకేం ఉద్యోగం చేసి, సంపాదించి పెట్టదుగా. నా ఇంటి పేరు నిలబెట్టదుగా. అన్నాడు ఉక్రోషంతో. శీను ఇవ్వాళ కాకపోతే రేపు మారతాడు. నీకు సంపాదించి పెడతాడు. నిన్ను పోషిస్తాడు. నీ ఇంటి పేరు నిలబెడతాడురా అన్నాడు ఆవేశంతో. నీ మొహం ఇవ్వాల్టి రోజున కూతురే కొడుకుతో సమానం. కొడుకులు ఉన్నా లేకున్నా ఒకటేరా. ఈ విషయం నీకెప్పటికి తెలుస్తుందో కాని. నిన్ను నీ కూతురే కాపాడాలి అన్నాడు దీనంగా. ఇంతలో పదో తరగతి పరీక్షలు రానే వచ్చాయి. శ్యామల డిస్టింక్షన్‌లో పాసయ్యింది. శీను ఫెయిలయ్యాడు. ఆ విషయం శంకర్‌కి తెలిసింది. కాని ఎంతమాత్రమూ తగ్గకపోగా ఇంకా శీనునే వెనకేసుకొచ్చాడు. కాని శ్యామలకు మనసులో బాధ మాత్రం అలాగే ఉంది. పేపరు వాళ్లు, కాలేజీల వాళ్లు వచ్చి ఇంటర్వ్యూలు చేస్తున్నారు. ఇదంతా నాన్న ప్రోత్సాహంతోనే అని చెప్తోంది. అయినా ఆయన మనసు కరగడం లేదు. ఇంతలో ఎంసెట్ ఎగ్జామ్స్‌కి ప్రిపేరయ్యి బాగా రాసింది. మంచి ర్యాంకు వచ్చింది. అలాగే మంచి క్యాలేజీలో సీటు కూడా వచ్చింది. ఫ్రెండ్స్ ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా వచ్చింది శ్యామలకు. అన్నింట్లో తల్లి అండదండలతో ముందడుగు వేస్తోంది. చుట్టుపక్కల కాలేజీల్లో, ఇంటి దగ్గర, చుట్టాలు పక్కాల్లో తనో చిన్న సైజు సెలెబ్రిటీ అయిపోయింది. ఒక పక్క చదువుకుంటూనే తనలాంటి ఎందరినో కలుపుకుని సేవా కార్యక్రమాలు చేస్తోంది. బట్టలు పోగు చేసి లేని వాళ్లకు ఇవ్వడం. ఆహారం లేని వాళ్ల కోసం తాను స్వయంగా తీసుకెళ్లి పెట్టడం వంటివి. స్పాన్సర్స్‌ని వెతికి వాళ్ల చేతుల మీదుగానే స్పాన్సర్ చేయించడం వంటివి చేస్తోంది. అలాగే స్పాన్సర్స్‌కి మంచి పేరు వచ్చి వాళ్ల మరింత మందికి సాయం చేసేలా ప్రణాళికలు రూపొందించి వాటిని తన గ్రూపు మెంబర్స్ చేత అమలు చేయించేలా శ్రద్ధ తీసుకుంటోంది. ఊరూ వాడా ఎంత మంది వేనోళ్ల పొగిడినా శంకర్ మనసును ఏదీ కదిలించలేక పోతోంది. ఇంతలో రామారావు నుంచి శంకర్‌కి ఫోన్ వచ్చింది. శీను మత్తుమందులకు అలవాటుపడి ఇంట్లో సామాన్లు అమ్మేసుకుని నాశనమైపోతున్నాడని చెప్పాడు. 'అరే శ్యామలకు చెప్పి నా కొడుకుని బాగు చేసే మార్గం అడగరా... అంటూ ప్రాథేయపడ్డాడు. "ఛీ నేనా... ఆ కరివేపాకునా. అడగనంటే అడగను. తెలిసిన మంచి డాక్టర్ ఉన్నారు చూపిద్దాం అన్నాడు." ఛ...ఊర్కోరా కొడుకు కొడుకు అంటున్నావ్. చూస్తున్నావ్‌గా నా పరిస్థితి. నీ కూతుర్నీ చూస్తున్నావ్‌గా ఏం తెలుసుకున్నావ్. నువ్వు మనిషివి కాదురా. కొడుకు మానియాతో అల్లాడుతున్న సైకోవి. చాలు నీతో ఇన్నేళ్ల ఫ్రెండ్‌షిప్ చేసినందుకు సిగ్గుపడుతున్నాను. శ్యామల లాంటి కూతురు నాకుంటే బంగారు పూలతో అభిషేకం చేసేవాడిని. బంగారు తల్లిలా చూసుకునేవాడిని. నేనే చిట్టితల్లికి ఫోన్ చేస్తాను. గుడ్‌బై" అంటూ ఫోన్ పెట్టేశాడు. 'పోరా... చేసుకుంటే చేస్కో నాకెందుకు అని మనసులో అనుకుని ఫోన్ పెట్టేశాడు...' శ్యామలకి ఫోన్ చేశాడు మావయ్యా... వెంటనే మీరు శీనును ఇక్కడికి తీసుకొచ్చేయండి. ఇక్కడ సేవా సంస్థ ఒకటి ఉంది. మంచి డాక్టర్ అంకుల్ ఉన్నారు. నయం చేయిద్దాం. తర్వాత నెమ్మదినెమ్మదిగా అందరిలో కలిసే ప్రయత్నం చేద్దాం అంది. చెప్పిందే తడవుగా శీనును తీసుకొచ్చాడు. డాక్టర్ దగ్గరికి తీస్కెళ్లి ట్రీట్‌మెంట్ చేయించింది. అంతా ఉచితంగానే శ్యామలతో కలిసి డాక్టర్ చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి దేశవిదేశాలకూ పాకడంతో ఆయనకూ ఎనలేని గౌరవమర్యాదలు వచ్చాయని శ్యామల అంటే అభిమానం ఆ డాక్టర్‌కు. చిన్న వయసులో ఎంతో పరిణతితో చదువుకుంటూ తోటివారి గురించి ఆలోచిస్తోందనే కారణంతోనే ఆయన శ్యామలకు సాయం చేస్తుంటారు. రామారావు డబ్బులు ఇచ్చాడు డాక్టర్‌కు వద్దని వారించాడు. ఇదంతా శ్యామల గొప్పతనమే అంటూ పొగిడాడు. రామారావు శ్యామలను మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. రెగ్యులర్ ట్రీట్‌మెంట్‌తో మత్తుమందుల అలవాటు నుంచీ కొంత మెరుగయ్యాడు శీను. తనని తన గ్రూపుకి సెక్రటరీని చేసింది. శీను చెప్పినట్టు నడుచుకోవాలంటూ తన గ్రూపు మెంబర్స్‌కి చెప్పడంతో వారూ కూడా తన నిర్ణయాన్ని శీనుకు చెప్పేవారు. చెయ్యాల్సిన పనులు, వివరాలు అన్నీ లిస్టు శీనుకు అప్పజెప్పింది. నెమ్మది నెమ్మదిగా శీను జనంలో కలుస్తున్నాడు. శ్యామలకు సాయంగా ఉంటున్నాడు.... రామారావు శ్యామల చేతులు పట్టుకుని పెద్దపెట్టున ఏడ్చేసాడు. తల్లీ... వాడికి ప్రాణం పోసావు. నీకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో అర్థం కావట్లేదు అన్నాడు. ఊర్కోండి మావయ్యా మీరు మరీను. అంతా మనమే మనలో ఈ కృతజ్ఞతలు ఎందుకు అంటుండగా శ్యామలకు ఫోన్ వచ్చింది. మావయ్య ఒక్క నిమిషం. అమ్మ ఫోన్ చేస్తోంది. "హా అమ్మా.... చెప్పు ఏంటి...శ్యామూ.... నాన్నకు యాక్సిడెంట్ అయిందే. ఎవరో ఫోన్ చేసి చెప్పారు ఇందాక...ఆస్పత్రికి రమ్మని అడ్రస్ చెప్పారు. నాకు కాళ్లూ చేతులు ఆడ్డం లేదు. త్వరగా రామ్మా. నాకు కంగారుగా ఉంది. అంటూ ఏడుస్తోంది. నాన్నకు యాక్సిడెంటా..! కంగారుపడకు నేనొచ్చేస్తున్నా. అంటూ కళ్లనీళ్లతో ఫోన్ పెట్టేసి. మావయ్యకు ఈ విషయం చెప్పింది. ఇద్దరూ బయల్దేరి వెళ్లారు." రా శ్యామూ...చూడు నాన్నను ఐసీయూలో ఉంచారు. చాలా రక్తం పోయిందట. తలకు బలమైన గాయమైందట. నాకేం చెయ్యాలో అర్థం కావట్లేదు. అంటూ ఏడుస్తున్న తల్లిని ఓదారుస్తోంది. ఇంతలో నర్సు

వచ్చి. ఏ పాజిటివ్ బ్లడ్ కావాలి అర్జంట్‌గా బ్లడ్‌బ్యాంక్‌కు ఫోన్ చేసి తెప్పించండి అంది. శ్యామూ అన్ని బ్లడ్‌బ్యాంక్స్‌కి ఫోన్ చేసింది. కాని ఎక్కడా రక్త నిల్వలు లేవు. ఏం చేయాలో అర్థం కాక, నర్సుకు విషయం చెప్పింది. " నా రక్తం గ్రూపు పరీక్షించండి నేను ఆయన కూతుర్నేగా సరిపోతుందో లేదో చూడండి' అంది...సరే పద...అంటూ పరీక్ష చేసి సరిగ్గా ఏ పాజిటివే కావడంతో తండ్రికి రక్తం ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. డాక్టర్...అంతా పూర్తయ్యింది. డాక్టర్ సౌమ్యని లోపలికి పిలిచారు. చూడండి... తలకి బలమైన గాయమై రక్తం గడ్డకట్టింది. కాని కొన్ని ఖరీదైనా ఇంజెక్షన్స్ చేస్తే ఆ గడ్డ కరుగుతుంది.. కారణంగా తరచూ తలనొప్పి రావొచ్చు.. కంగారు పడక్కర్లేదు...కాని ఒక్క విషయం. తటపటాయిస్తుండడంతో...చెప్పండి డాక్టర్ ఏమైంది...పర్లేదు...ఏ విషయమైనా చెప్పండి. తట్టుకోగల శక్తి నాకుంది అనేసరికి. ఏ ప్రమాదం లేదు కాని...మాట పోయింది. ఇదొక్కటే తప్ప మిగతా ఇంకేం సమస్యా లేదు. మాట కూడా త్వరలో వచ్చేలా పరీక్షలు చేద్దాం. అనేసరికి అప్రయత్నంగా కన్నీళ్లు కారాయి. డోన్ట్ వర్రీ సౌమ్య మాట కూడా వచ్చేలా చేద్దాం... అని డాక్టర్ ఓదార్చారు. బయటికొచ్చి జరిగిన విషయం శ్యామలకు చెప్పింది. గుండాగినంత పనైంది. అయినా ధైర్యం తెచ్చుకుని తల్లికి ధైర్యం చెప్పింది. రేపు డిశ్చార్జ్ చేస్తాం జాగ్రత్తగా టైంకి మందులు వేయండి. దగ్గరుండి ఒకరు చూస్కోవాలి అనేసరికి కుటుంబసభ్యులంతా సరే అన్నారు. డిశ్చార్జ్ అయ్యి ఇంటికొచ్చాడు శంకర్. రాత్రనక పగలనకు శ్యామల తండ్రి దగ్గర నుంచి కదలడం లేదు. దగ్గరుండి సేవలు చేస్తోంది, అయినా శంకర్‌కి ఇది నచ్చట్లా మాట రావడం లేదని తెలిసి బాధపడకపోగా ఇదంతా కూతురి వల్లేనంటూ తన చూపులతోనే తిడుతు న్నాడు. మందులిస్తుంటే విసిరికొడుతున్నాడు. అయినా శ్యామల మాత్రం ఎంతమాత్రమూ బాధపడడం లేదు. ఒక రోజు శ్యామల తండ్రికి జ్యూస్ ఇవ్వబో తుంటే పొమ్మని సైగ చేసాడు. అయినా శ్యామల తండ్రి చేతికి జ్యూస్ గ్లాస్ ఇచ్చింది. అంతే గ్లాస్ కింద పడేసి చెంప ఛెళ్లు మనిపించాడు. అప్పుడే గుమ్మంలోకి అడుగుపెడుతున్న రామారావు ఈ సంఘటనను గమనించి గబగబా వచ్చి శంకర్ చెంప ఛెళ్లు మనిపించాడు.. నన్నే కొడతావా. అన్నట్టు చూసేసరికి మావయ్యా... నాన్ననెందుకు కొట్టారు... మీరు చేసింది సరైనది కాదు.. అంటూ కోపంతో లోపలికెళ్లిపోయింది. కూతురు ముందు అలా చేయి చేసుకునేసరికి అవమానంగా భావించి పెరట్లోకి వెళ్లి మూతిముడుచుకుని కూర్చున్నాడు శంకర్. రామారావు వెళ్లి జరిగిన విషయాలన్నీ పూసగుచ్చినట్టు చెప్పాడు. రక్తం ఇచ్చిందా. అంటూ చేతిని తడుముకున్నాడు. అవును లేదంటే నువ్వు బతికేవాడివి కావు. తెల్సా...అనేసరికి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. గట్టిగా ఏడ్చేశాడు శీను గురించి చెప్పేసరికి మరింత గట్టిగా ఏడ్చాడు. ఇప్పుడు శీను ఎంత మారాడో తెల్సా అలాంటి కూతురు మీద చెయ్యి చేసుకోవడానికి నీకు చేతులెలా వచ్చాయంటూ. గట్టిగా తిట్టేసరికి రామారావు చేతులు పట్టుకున్నాడు. అప్పటి నుంచి చాలా సిగ్గుగా ఉంది శంకర్‌కి. కూతుర్ని చూడట్లేదు. ఇచ్చినవి తీసుకోవట్లేదు...సౌమ్యను రమ్మంటూ సైగలు చేస్తున్నాడు. సౌమ్య వచ్చింది. సైగల ద్వారా అడిగాడు, శ్యామల నన్ను క్షమిస్తుందా...? అని అవేం మాటలండీ దానికి మీరంటే చాలా ఇష్టం. ఒక్కసారి రమ్మని సైగ చెయ్యండి చాలు. వచ్చి మీ ఒళ్లో నిద్రపోతుంది. అనేసరికి తటపటాయించాడు.

స్టేజ్ మీద కూతురి తల నిమిరి నుదుటి మీద ముద్దు పెట్టుకున్నాడు... ఎప్పటినుంచి నాన్న అలా ఎప్పుడు దీవిస్తారా అని ఎదురుచూస్తున్న శ్యామలకు చెప్పలేనంత ఆనందం కలిగింది...కాగితం మీద రాసిన ఒక వాక్యాన్ని శంకర్ స్టేజ్ మీద అందరికీ కనిపించేలా చూపించాడు...

ఇప్పుడొద్దులే. రక్తం ఇచ్చాను కదా అందుకే జాలి చూపిస్తున్నాడేమో తన తండ్రి అని బాధపడు తుంది. నువ్వెళ్లు అంటూ రాసి చూపించాడు. కాలేజీలో రేపు మీ అమ్మాయికి ఎలక్యూషన్ కాంపిటీషన్ ఉందట కాలేజీలో. 'మీ నాన్న గురించి మీ మాటల్లో' అనే టాపిక్ మీదట...పేరెంట్స్ అందరికీ ఇన్విటేషన్స్ పంపారు. అందులోనూ సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు మీ అమ్మాయి పెద్ద అవార్డు కూడా అందుకోబోతోంది తెల్సా.. మనం వెళ్దాం రేపు అంది. నేను రాను...అన్నాడు సైగ చేసి. మీ కూతురండి శ్యామల.. మీ గురించే మాట్లాడు తుంది. మీరు వినరా ఏంటి ఏం చెప్తుందో... అంది. మీరు రాకపోతే ఇప్పుడు నిజంగా బాధపడుతుంది. అనేసరికి తల ఊపాడు వెళ్దామన్నట్టుగా మీటింగ్ మొదలయ్యింది. పేరెంట్స్ అంతా స్టేజ్ ఎదురుగా కూర్చున్నారు. ఎలక్యూషన్ పార్టిసిపెంట్స్ అంతా స్టేజ్ మీదున్నారు. నిర్వాహకులు ఒక్కొక్కరి పేరు అనౌన్స్ చేస్తుంటే వారు వచ్చి మాట్లాడి వెళ్లి తమ సీట్లలో కూర్చుంటు న్నారు.శ్యామల వంతు వచ్చింది. "నాన్నంటే ఆకాశమంత హృదయం ఉన్నవాడు. తెల్లని పువ్వులాంటి మనస్సున్నవాడు. కష్టంలో గొడుగుపట్టి కాపాడేవాడు. ప్రపంచమంతా ఒక వైపు, మా నాన్న ఒక్కరే ఒక వైపు. ఇవ్వాళ నేను మీ ముందుకు ఇలా వచ్చానంటే, అది మా నాన్న ప్రోత్సాహమే. అనుక్షణం నేనేంటో నాకు గుర్తు చేసేవారు. తిట్టినా, కొట్టినా నా మంచి కోసమే చేశారు. నా కర్తవ్యాన్ని గుర్తు చేస్తుండేవారు. మా నాన్న లేనిదే నేను లేను. మా నాన్న మనసు హిమాలయ శిఖరమంత ఎత్తు. ఎంతో ఉత్తమమైన వ్యక్తిత్వం ఉన్న మనిషి" అంటూ స్టేజ్ మీద తన గురించి చెప్తుంటే స్టేజ్ కింద శంకర్‌కి కన్నీళ్లు ఉబికొస్తున్నాయ్. కూతురు చెప్పేదాంట్లో ఒక్క మంచి లక్షణం కూడా లేదు తనలో...పెట్టిన ఇబ్బందుల్ని ఇలా వర్ణించిందా నా గురించి, ఇంత ఉన్నతంగానా...అంటూ సౌమ్య చేతులు పటుకున్నాడు గట్టిగా...పక్కనే కూర్చున్న రామారావుని చూశాడు..."చూశావా...నీ కూతురు శ్యామల... ఎంత గొప్పదయ్యిందో.." అన్నాడు.. అంతే కన్నీళ్లు తుడుచుకుని నా కూతురు...తను నా కూతురు...నేను కన్న కూతురు... నా రక్తం అంటూ సైగలు చేశాడు...పార్టిసిపెంట్స్ అయిపోవడంతో శ్యామలకు అవార్డు అనౌన్స్ చేశారు... శ్యామల మైకందుకుని 'సభాధ్యక్షులకు ఒక విన్నపం. నా ఈ సేవా కార్యక్రమాలకు కారణం మా నాన్న.. దయచేసి ఈ అవార్డు ఆయనకు అందించగల రంటూ" చెప్పేసరికి. శంకర్‌ని స్టేజ్ మీదకి రమ్మని మైక్‌లో గట్టిగా అనౌన్స్ చేశారు. శంకర్ ఏడుస్తూనే స్టేజ్ ఎక్కాడు. అవార్డు అందుకున్నాడు. అలాగే చేస్తున్న సేవా కార్యక్రమాలకు గాను 50 వేల క్యాష్ ప్రైజ్ అలాగే తన ఉన్నత చదువుల కోసం మరో 50 వేల చెక్కును అందించారు. అవన్నీ అందుకునే సరికి ఆ అభినందనల మందారమాలలకు శంకర్‌కి ఊపిరాడలేదు. కూతుర్ని చూస్తున్నాడు కాని కళ్లల్లోకి చూడలేకపోతున్నాడు. తప్పు చేసిన భావన మనసులో ఉండడంతో కరివేపాకు అని ఎగతాళి మాటలు గుర్తు రావడంతో, చెప్పలేనంత బాధను లోలోపల అనుభవిస్తున్నాడు... అయినా తమాయించుకుని...ఎంతైనా తన రక్తం అంటూ కూతురి చెయ్యెత్తాడు అందరి ముందు...ఒక్కసారిగా కూతురు కాళ్ల మీద పడిపోయాడు..ఊహించని ఆ పరిణామానికి శ్యామల అవాక్కయ్యింది...

లే నాన్న...ఇదేంటి తప్పు చిన్న వాళ్ల కాళ్ల మీద పెద్ద వాళ్లు పడకూడదు...అనేసరికి స్టేజ్ మీద కూతురి తల నిమిరి నుదుటి మీద ముదు పెట్టుకున్నాడు...ఎప్పటినుంచి నాన్న అలా ఎప్పుడు దీవిస్తారా అని ఎదురుచూస్తున్న శ్యామలకు చెప్పలేనంత ఆనందం కలిగింది...కాగితం మీద రాసిన ఒక వాక్యాన్ని శంకర్ స్టేజ్ మీద అందరికీ కనిపించేలా చూపించాడు...'కూతురైనా, కొడుకైనా ఒక్కటే....నేను చేసిన తప్పు మీరెవరూ చేయొద్దు... కూతుళ్లను అనరాని మాటలనొద్దు...'అంటూ చూపించేసరికి ఆడిటోరియం అంతా చప్పట్లతో మారుమోగిపోయింది....సౌమ్యని కౌగిలించుకుంది శ్యామల...చూశావా...నే చెప్పానా....కాలం సమస్యల్ని పరిష్కరిస్తుందని..అంటూ బుగ్గ మీద ముద్దు పెట్టింది. ✦

యాసిడ్ దాడి జీవితాల్ని కాల్చేస్తోంది. చిందిన చుక్కలన్ని సార్లు యువతుల జీవితాల్ని కబళిస్తోంది. లలితా బెన్ బన్సీది కూడా అలాంటి జీవితమే. ఒంటరితనంతో తెరమరుగైన ఓ అమ్మాయి కథే. కానీ ఓ రాంగ్ కాల్ నిండు జీవితాన్ని తొలిసారి మాట్లాడింది. భవిష్యత్తు, కలలు, లక్ష్యాలు అంటూ కొత్త సంభాషణ మొదలెట్టింది. ఈ సర్వైవర్ కథ తెలుసుకోండి.

యాసిడ్ కాల్చలేని ఓ జీవితం

ముంబైకి చెందిన లలితా బెన్ ఓసారి ఉత్తరప్రదేశ్‌లోని తన సొంతూరికి పెళ్లికి వెళ్లింది. ఆ వివాహ కార్యక్రమాల్లోనే తన చిన్న తమ్ముడు సన్నీకి బంధువు శ్యామ్‌బాబుకి మాటామాటా పెరిగింది. ఇద్దరూ కొట్టుకునే దూరం వెళ్లడంతో లలిత జోక్యం చేసుకుని ఇద్దరినీ చెంప దెబ్బ కొట్టి మందలించింది. అందరి ముందు అవమానానికి గురైనట్టు తలచిన శ్యామ్‌బాబు లలితపై అక్కసు పెంచుకున్నాడు. ఆమెకు పెళ్లి కుదిరి 15 రోజుల్లో వివాహమనగా ఆజమ్‌గఢ్‌లో ఉండగానే ఆమెపై శ్యామ్‌బాబు యాసిడ్‌తో దాడి చేశాడు. క్షణాల్లో ఆమె అస్తిత్వం ఆవిరైంది. అత్యవసర చికిత్సతో బయటపడినా ఆ ఘటన నుంచి మాత్రం ఆమె చాలాఏళ్లు బయటపడలేకపోయింది. 2012లో దాడి జరిగాక ఆమె పూర్తిగా అజ్ఞాత జీవితంలోకి వెళ్లిపోయింది. చుట్టుపక్కలవాళ్లే కాదు కుటుంబ సభ్యుల ముందు కూడా తిరగలేకపోయేది. యాసిడ్ కాల్చేసింది తన ముఖాన్ని, దేహాన్నే కాదు ఆమె కలలు గన్న విలువైన జీవితాన్ని. లలిత ఇక ఎప్పటికీ అలానే ఒంటరిగా కుమిలిపోతుందేమో అనుకునేవాళ్లంతా. ఆమెను బయటకు తెచ్చే ప్రయత్నాలు చేసిచేసి అలసిపోయారు. ఇక లలిత కథ అంతే... చాలామంది యాసిడ్ దాడి బాధితుల్లానే తెరమరుగైపోయే ఈ విషాద గాథగానే అనుకున్నారు. కానీ తిరిగి కొత్త జీవితాన్ని సాగించాలనే ఆమె కాంక్ష ఎన్నో శస్త్ర చికిత్సలకు అలవాటు చేసింది. సుమారు 17 సర్జరీలు అయ్యాక ఆమె కాస్త కోలుకుంది. కానీ పూర్తిగా జీవితం మారలేదు. ఆమె చేసిన ఒకే ఒక మార్పు ఆజామ్‌గఢ్ నుంచి థానే దగ్గరలోని కల్వాకు ఇల్లు మార్చడం. ఇదొక్కటే తన జీవితంలో తను చేయగలిగిన మార్పు అనుకుంటున్న లలిత ఓ రోజు ఒకరికి చేయబోయి మరొకరికి ఫోన్ కాల్ చేసింది. అవతలి వ్యక్తిని పట్టించుకోకుండా మాట్లాడేసిన కాసేపటికి గానీ లలితకు అర్థమయ్యింది అది రాంగ్ కాల్ అని. వెంటనే ఫోన్ పెట్టేసింది. ఆ తర్వాత 15 రోజులకు రవి మళ్లీ ఫోన్ ద్వారా లలితతో మాట కలిపాడు. ఆ తర్వాత వారి సంభాషణ ఒకరొకరి పరిచయాల నుంచి వారి జీవితంలో ఎదురైన అతిపెద్ద విషయాల వరకు సాగింది... అదీ కొన్ని రోజుల వ్యవధిలోనే ప్రాణ స్నేహితులయ్యేంతగా. అవతలి వ్యక్తి పేరు రవి శంకర్. మలాడ్‌కు చెందిన అతడు కందివిలీలో సీసీటీవీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. రాంచీలో పెట్రోల్ బంక్ కూడా ఉంది. లలితకు 26 ఏళ్లు, రవి శంకర్‌కు 27 ఏళ్లు. వయస్సులో ఈ దగ్గరితనం కూడా వారి ఆలోచనలను, మనస్సులను ఒక్కటి చేసింది. కేవలం రెండు మూడు నెలల్లో వారి బంధం బలపడింది.

ప్రాణ బంధం...

రవిశంకర్‌తో 5 నిమిషాల సంభాషణ తన ఐదేళ్ల క్షోభను దూరం చేయడంతో తనకు జీవితాంతం అండగా తోడుగా నిలిచే స్నేహం దొరికిందని ఎంతో సంతోష పడింది. రవి శంకర్ ఇష్టాయిష్టాలే కాదు అతడికి కాబోయే భార్యను కూడా తానే ఎంపిక చేస్తానని ఉద్వేగంతో చెప్పేది లలిత. కానీ అప్పటికే రవిశంకర్ తన జీవిత భాగస్వామిని ఎంచేసుకున్నాడు. తానెవరో కాదు లలితే. అమ్మను కూడా ఈ విషయంలో ఒప్పించాడు. ప్రేమకు, పెళ్లికి, జీవితానికి కావాల్సింది మంచి రూపం కాదు గొప్ప మనస్సు అనే తన మాట లలిత దగ్గర కూడా నెగ్గించుకున్నాడు. లలితను జాలి పడి పెళ్లి చేసుకోలేదని లలిత లేని జీవితాన్ని ఊహించుకోలేకే లలితకు ఓ నిండైన జీవితం ఉండాలనే కోరికతోటే తానా నిర్ణయం తీసుకున్నానని రవిశంకర్ పెద్దలకు వివరించాడు. ఈ ఏడాది మే నెలలో థానె కోర్టు వద్ద లలితను వివాహమాడాడు రవిశంకర్. లలిత కథ బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్‌కు తెలుసు. సాహస్ ఫౌండేషన్ ద్వారా లలితలాంటి 21 మంది అమ్మాయిల చికిత్సలకు ఆయన తనవంతు సాయం చేస్తున్నాడు. ఎప్పుడైతే రవిశంకర్ నిర్ణయం గురించి తెలిసిందో అతణ్ని వివేక్ అభిమానించడం మొదలెట్టాడు. తన చిన్ని చెల్లెలికి జీవితాన్నిచ్చిన మానవతామూర్తిగా రవిశంకర్‌ను అభినందించడమే కాదు వారిద్దరి పేరిట ముంబైలో ఓ ఫ్లాట్‌ను కూడా కానుకగా ఇచ్చాడు. వారిద్దరి ఉమ్మడి జీవితం అక్కడి నుంచే మొదలైంది. ఇంతకీ రవి శంకర్‌కు లలితలో అమితంగా ఇష్టపడేది ఏంటో తెలుసా... ఆమె గొంతుక. ◆



పైడిమర్రి జీవిత చరిత్ర

భారత దేశం నా మాతృభూమి... భారతీయులందరూ నా సహోదరులు... విద్యార్థి దశలో మనం దరం చేసిన ప్రతిజ్ఞ ఇది. పాఠశాల స్థాయిలో పాఠ్య పుస్తకాల్లో ఇప్పటికీ ఈ ప్రతిజ్ఞ వుంది. పైన చెప్పుకున్న వాక్యాలతో ఇప్పటికీ పాఠశాలల్లో విద్యార్థులు ప్రతిజ్ఞ చేస్తున్నారు. ప్రతిజ్ఞని భారత ప్రభుత్వం ఆమోదించి 2012 నాటికి 50 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ ప్రతిజ్ఞ స్ఫూర్తితో నేడు అనేక సందర్భాల్లో వివిధ ప్రతిజ్ఞలని చేస్తున్నారు. మరి అసలు ప్రతిజ్ఞ రచయిత ఎవరనేది ఎంతమందికి తెలుసు? చాలామందికి తెలీదనే చెప్పాలి. నిజానికి 2014 వరకు ప్రతిజ్ఞ రచయిత ఎవరో ఎక్కువ మందికి తెలీదు. 'ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు' అనే విషయం కొందరు సాహితీవేత్తల కృషి వల్ల బైటి ప్రపంచానికి తెలిసింది. ప్రభుత్వం ద్వారా ధృవీకరించబడడంతో 2015-16లో తెలుగు రాష్ట్రాల పాఠ్య పుస్తకాలలో ప్రతిజ్ఞ మొదట పైడిమర్రి పేరును చేర్చడం జరిగింది. పైడిమర్రి గురించి మరుగున పడిన ఇలాంటి ఎన్నో నిజాలతో పాటు ఆయన జీవితాన్ని 'భారతదేశం నా మాతృభూమి' పుస్తకం ద్వారా కళ్లకు కట్టినట్టు చేశారు రచయిత మందరపు రాంప్రదీప్. అతి బీద కుటుంబంలో పుట్టిన పైడిమర్రి జీవితంలో ఎన్నో ఒడిదొడుకులని ఎదుర్కొన్నారు. మెట్రిక్యులేషన్ పూర్తిచేసుకుని అప్పటి నిజాం పరిపాలనలో కోశాధికారిగా పని చేశారు. అయితే ఒక దశలో నిజాం పాలనకి వ్యతిరేకంగా బానిసత్వ చర్యలని నిలదీస్తూ రచనలని చేశారు. యాదగిరి హనుమంతు, కాళోజీతో కలిసి ఉద్యమాల్లో పాల్గొని పాటలతో అందరినీ చైతన్య పరిచేవారు. నవాబుల పాలనలో పనిచేసిన పైడిమర్రి తెలుగు భాషతోపాటు ఉర్దూ భాషపైనా మంచి పట్టు సాధించారు. వ్యక్తి కన్నా వ్యవస్థ బాగుండాలనేది పైడిమర్రి ఆలోచన. ఆ ఆలోచనే పైడిమర్రి ప్రతిజ్ఞ రచనకి పూనుకునేలా చేసిందనే విషయం రాంప్రదీప్ రాసిన ఈ పుస్తకం ప్రతిబింబిస్తోంది. స్వేచ్ఛ, సమానత్వాన్ని ప్రతిబింబించే పదాలతో పైడిమర్రి రచించిన 'ప్రతిజ్ఞ భావితరానికి మార్గదర్శకంగా చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుంది. మన దేశంలోని అన్ని భాషల్లోకి ఈ ప్రతిజ్ఞ తర్జుమాచేయబడింది. అయితే తెలుగు రాష్ట్రాల్లో తప్ప పైడిమర్రి పేరును ఇతర రాష్ట్ర పాఠ్య పుస్తకాల్లో ప్రచురణ జరగ కపోవడం విచారకరం. తన జీవితంలో ఆచరించి, పాటించిన విలువలనే పైడిమర్రి ప్రతిజ్ఞలో కూడా పొందుపరిచారు. అలాంటి ప్రతిజ్ఞ రచయిత గురించి ఒక్కసారైనా తెలుసుకునేందుకు భారత దేశం నా మాతృభూమి అనే పుస్తకాన్ని చదివితీరాల్సిందే. **-శారద**

పుస్తకం పేరు : భారతదేశం నా మాతృభూమి
సంకలనం: మందరపు రాంప్రదీప్
పేజీలు :64, **వెల :**30
ప్రతులకు: వి.జి.యస్ బుక్ లింక్స్,5-6-59-3, తమ్మిన కృష్ణ వీధి, సాయిరాం థియేటర్ వెనుక, విజయవాడ- 520009, **ఫోన్:**08662515555

వివరం

రన్ రారాముఋీ

పాత టైర్ల రబ్బర్‌ను ఒలిచి చెప్పుల సైజు చేసుకుని, రెండు పాత స్కర్టు పీలికలతో పాదాలకు కట్టుకుని పరుగందుకుంది రారాముఋీ మహిళ. అలాఅలా వంద కి.మీ.ల దూరం అరిగిపోయింది. అలా ఓ అల్ట్రామారథాన్ ప్రపంచానికి ఓ కొత్త విజేతను పరిచయం చేసింది. ఆ విజేత పేరు మరియా లొరెనా రమీరెజ్. మెక్సికో తెగయిన రారాముఋీకి చెందిన మహిళ మరియా లొరెనా. ఈ మధ్యే 50 కి.మీ. అల్ట్రామారథాన్‌లో ఇలాగే ప్రథమ స్థానంలో నిలిచి సంచలనం సృష్టించింది.

రారాముఋీ తెగే నడకకు, పరుగుకు పేరు. స్థానిక భాషలో రారా అంటే పాదం, ముఋీ అంటే పరుగు అని అర్థం. ఆ తెగ పేరు ప్రతిష్టలు ప్రపంచానికి చాటింది 22 ఏళ్ల మరియా లొరెనా. మరియా లొరెనా మారథాన్‌లకు శిక్షణ తీసుకోలేదు. ఆమెకు పరుగుకు కావాల్సిన గేర్ లేదు. పర్వత ప్రాంతాల్లో పటిష్టంగా ఉండే నాణ్యమైన రన్నింగ్ షూలు లేవు. కంప్రెషన్ సాక్సులు లేవు. గంటల పరుగులో దప్పిక తీర్చేందుకు ఎనర్జీ డ్రింక్‌లు, బార్‌లు, జెల్‌లు అసలే లేవు. లైక్రా స్యూట్‌కు బదులు తమ సంప్రదాయ స్కర్ట్ వేసుకుని ఓ వాటర్ బాటిల్, కర్చీప్ చేతిలో పట్టుకుని 7 గంటల 3 నిమిషాల్లో ఫినిష్ లైన్ చేరుకుంది. 12 దేశాలకు చెందిన 500 మంది పాల్గొన్న ఈ అల్ట్రామారథాన్‌లో మరియా విజయం చాలా చర్చనే లేవనెత్తింది. క్రీడా సాంకేతికత పేరా కోట్ల టర్నోవర్ వ్యాపారం నడుస్తోంది. కానీ మరియా ఇవేమీ లేకుండానే పోటీలో పాల్గొన్న తొలిసారే విజేతగా నిలవడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. మరియాకు తెలిసిందల్లా ఒకటే పశువులను మేపుకుంటూ రోజుకు 15 గంటల పాటు ఒట్టి కాళ్లతో నడవడమే.



గ్వావా.. మెక్సికన్



చికెన్ మీట్ బాల్ ట్యాకోస్



కావాల్సిన పదార్థాలు
చికెన్ -250 గ్రాములు
పచ్చిమిర్చి తరుగు-2 టేబుల్ స్పూన్లు
మిరియాలపొడి- 1 టేబుల్ స్పూన్
ఉప్పు-చిటికెడు
కొత్తిమీర తరుగు-1 టేబుల్ స్పూన్
అల్లం వెల్లుల్లి పేస్ట్-1 టేబుల్ స్పూన్
నూనె-సరిపడా
ట్యాకో షెల్స్-8(బజార్లో దొరుకుతాయి)
జున్ను-1కప్పు
ఉడికించిన బీన్స్-1/2 కప్పు
క్రీమ్-1/2 కప్పు
క్యాబేజ్-1
ఉల్లిపాయ-1
కొత్తిమీర తరుగు-1/4 కప్పు

తయారు చేసే విధానం

ముందుగా చికెన్‌ని శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా కట్‌చేసి ఉడికించుకోవాలి. ఒక బౌల్‌లో పచ్చిమిర్చి తరుగు, ఉప్పు, మిరియాల పొడి, కొత్తిమీర తరుగు, అల్లంవెల్లుల్లి పేస్ట్, ఉడికించిన చికెన్ ముక్కల్ని వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని చిన్న ఉండలుగా చేసి పక్కన పెట్టుకోవాలి. స్టౌవ్‌పై బాణలి వుంచి నూనె వేసి వేడెక్కిన తర్వాత చికెన్ బాల్స్‌ని వేయించుకోవాలి. గోధుమరంగు వచ్చే వరకు వేయించి ఒక ప్లేట్‌లోకి తీసి చల్లారనివ్వాలి. ఇప్పుడు ఒక మందపాటి పాత్రలో కొద్దిగా నూనె వేసి స్టౌపై వుంచి వేడెక్కనివ్వాలి. అందులో వెల్లుల్లి రెబ్బలు, వేసి వేయించుకోవాలి. తర్వాత బీన్స్ ముక్కలు, ఉల్లి తరుగు, జీలకర్ర, ఉప్పు, వేసి పేస్ట్‌లా డికించుకోవాలి. ఇప్పుడు ట్యాకోస్‌లో బీన్స్ మిశ్రమం, చికెన్ బాల్స్, జున్ను వుంచి వాటిని కొంతసేపు మగ్గనివ్వాలి. జున్ను కరిగిన వెంటనే బైటిక తీసి వాటిపై కొద్దిగా క్రీమ్‌ని చేర్చాలి. చివరిగా ఉల్లితరుగు, కొత్తిమీర తరుగుతో గార్నిష్ చేస్తే చికెన్ మీట్‌బాల్స్ ట్యాకోస్ రెడీ!

ఫిష్ ర్యాప్స్

కావాల్సిన పదార్థాలు
చేపలు(ముళ్ళుతొలగించినవి)-200గ్రాములు
క్యాబేజ్ తరుగు-4 పొరలు
నూనె-1 టేబుల్ స్పూన్
మిరియాల పొడి-2టేబుల్ స్పూన్లు
ఉప్పు-1/4టేబుల్ స్పూన్
టమాటా-1
ఉల్లిపాయ-1
కొత్తిమీర తరుగు-2 టేబుల్ స్పూన్లు
పచ్చిమిర్చి తరుగు-2 టేబుల్ స్పూన్లు
ఉప్పు-చిటికెడు
పెరుగు-1/2 కప్పు

తయారుచేసే విధానం

ముందుగా శుభ్రపరుచుకున్న చేపల్ని అంగుళం ముక్కలుగా తరిగి పక్కనపెట్టుకోవాలి. ఒక బౌల్‌లో నిమ్మరసం, ఉప్పు, చేపముక్కలు వేసి 30 నిమిషాలు నాననివ్వాలి. తర్వాత ఒక బౌల్‌లో అల్లం వెల్లుల్లి పేస్ట్, మిరియాలపొడి, నిమ్మరసం, ఉప్పు, కొద్దిగా నూనె వేసి బాగాకలిపి ఈ మిశ్రమాన్ని చేప ముక్కలకి పట్టించాలి. తర్వాత ఒక మందపాటి పాత్రలో వుంచి ఉడికించుకోవాలి. టామాటాలు, ఉల్లిపాయలల్ని చిన్నముక్కలుగా తరిగి పక్కనపెట్టుకోవాలి. ఒప్పుడు మరో బౌల్‌లో నూనె, పచ్చిమిర్చి, టమాటా -ఉల్లిపాయ తరుగు, నిమ్మరసం, ఉప్పు, కొత్తిమీర తరుగు, వేసి బాగా కలుపుకుని పక్కన పెట్టుకోవాలి. పెరుగులో కొద్దిగా ధనియాలపొడిని కలపాలి. క్యాబేజ్ పొరను తీసుకుని అందులో టమాటా మిశ్రమాన్ని ఉడికించిన చేపముక్కల్ని వుంచి రోల్‌చేసుకోవాలి. స్టౌవ్‌పై ప్యాన్ వుంచి ఈ రోల్‌ని వేయించుకోవాలి. స్టఫింగ్ మొత్తం మగ్గిన తర్వాత ఫిష్ రోల్స్‌ని తీసి ఒక ప్లేట్‌లో వుంచాలి. ఇప్పుడు ఒక్కో రోల్ తీసుకుని అందులో పెరుగును చేర్చితే ఫిష్ ర్యాప్స్ రెడీ! రోల్స్ మరీ పెద్దగా వుంటే మీకు కావాల్సిన సైజులో వాటిని కట్‌చేసుకోవచ్చు.

చికెన్ ఫ్రై

కావాల్సిన పదార్థాలు
చికెన్ ముక్కలు-4
ఆలివ్ నూనె-5 టేబుల్ స్పూన్లు
నిమ్మరసం-4 టేబుల్ స్పూన్లు
నిమ్మకాయల తురుము-1టేబుల్ స్పూన్
అల్లం తరుగు -1 టేబుల్ స్పూన్
ధనియాలపొడి-1టేబుల్ స్పూన్
ఉప్పు-రుచికి తగినంత
కొత్తిమీర తరుగు-2 టేబుల్ స్పూన్లు
కారం/పెప్రికా(క్యాప్సికం) పొడి-1టేబుల్ స్పూన్
ధనియాల పొడి-చిటికెడు

తయారుచేసే విధానం

ముందుగా చికెన్‌ను శుభ్రంగా కడిగి అంగుళం ముక్కలుగా తరిగి పక్కన పెట్టుకోవాలి. ఒక వెడల్పాటి బౌల్ తీసుకుని అందులో ఆలివ్ నూనె, నిమ్మరసం, నిమ్మకాయల తురుము, అల్లం కొత్తిమీర తరుగు, ధనియాల పొడి, ఉప్పు, కారం వేసి బాగా కలుపుకోవాలి. అందులో చికెన్ ముక్కలని కూడా వేసి మరోసారి కలిపుకోవాలి. ఈ మిశ్రమాన్ని గంటసేపు ఫ్రిజర్‌లో పెట్టాలి. ఫ్రిజ్ నుంచి చికెన్ మిశ్రమాన్ని బైటికి తీసి స్టౌపై ప్యాన్ పెట్టి కొద్దిగా నూనె వేసి వేడెక్కనివ్వాలి. ఇప్పుడు ఒక్కో చికెన్ ముక్కనూ పాన్‌పై వుంచి రెండు వైపులా బంగారు రంగు వచ్చేవరకు వేయించుకోవాలి. బాగా వేగిన చికెన్ ముక్కల్ని సర్వింగ్ ప్లేట్‌లో వుంచి కొద్దిగా చల్లారిన తర్వాత నిమ్మరసం, కొత్తిమీర తరుగుతో గార్నిష్ చేసి వేడివేడి అన్నంతో రుచిచూడండి.



బాల నేస్తాలు

జతచేద్దాం

పిల్లలూ ఇక్కడ కొన్ని బొమ్మలు వాటి ఎదురుగా కొన్ని అంకెల్ని ఉంచాం. అయితే మీరు చేయాల్సిందేంటంటే ఒక్కో వరుసలో మొత్తం ఎన్ని బొమ్మలున్నాయో లెక్కించి ఎదురుగా వున్న అంకెల్లో వాటి సమాన సంఖ్యతో జతచేయండి.



రంగులు అద్దండి



నేర్చుకుందాం



పిల్లలూ మీకు బొమ్మలు గీయడమంటే ఇష్టం కదా... మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ ముందుగా ఒకాపి బొమ్మను ఎలా గీయాలో ఇక్కడిచ్చారు. మీరూ ప్రయత్నించండి.

గుర్తించండి

పిల్లలూ! సీతాకోక చిలుకకి సంబంధించిన కొన్ని పదాలను ఇక్కడుంచాం! పైనున్న అక్షరాల పట్టికలో అవెక్కడున్నాయో గుర్తించి పెన్నుతో మార్క్ చేయండి.



n	i	c	e	b
o	p	z	p	u
f	a	s	t	t
p	b	z	w	t
b	u	g	i	e
l	q	n	n	r
f	l	y	g	f
o	l	k	s	l
w	d	r	e	y

WORD LIST

wings
bug
fast
nice
fly
butterfly

అతికిద్దాం

చింటూకి ఈ మధ్య అల్లరి మరీ ఎక్కువైపోయింది. టెడ్డీబేర్ బొమ్మను కత్తిరించి అతికించకుండా వెళ్లిపోయాడు. ఇక్కడిచ్చిన బొమ్మ ఆధారంగా మీరు దాన్ని జాగ్రత్తగా అతికించేయండి.



కనిపెడదాం

బన్నీ వాళ్ల గార్డెన్‌లో మీకు తెలిసిన కొన్ని జంతువులు దాగున్నాయి. బొమ్మల ఆధారంగా అవెక్కడున్నాయో కనిపెట్టండి.

భిన్నమైనదేది

ఇక్కడ ఆరు వరుసల్లో కొన్ని బొమ్మలున్నాయి. ఒక్కో వరుసలో ఒక భిన్నమైన బొమ్మ వుంది. అదెక్కడుందో కనిపెట్టి సున్నాచుట్టేయండి.



కలివి కోడి

పిల్లలూ మీకు రకరకాల పక్షుల గురించి తెలుసు కదా మరి జెరాడన్ కౌసర్ గురించి ఎప్పుడైనా విన్నారా...

◆ఇవి ఆంధ్రప్రదేశ్‌కి చెందినవే..

◆థామస్ సి జెర్డాన్ అనే పర్యావరణ శాస్త్రవేత్త 1848లో మొట్టమొదట వీటిని కనుగొన్నాడు. అప్పటి నుంచి వీటికి ఆ పేరే స్థిరపడింది.

◆తూర్పుకనుమలతోపాటు మహారాష్ట్ర, పెన్నా, గోదావరి నదీతీరాల్లో వీటిని గుర్తించారు.

◆గ్లరియెలైడె కుటుంబానికి చెందిన వీటిని మనదేశంలో కలివి కోడి అని పిలుస్తారు.

◆పొడవాటి కాళ్ళు, పొట్టి రెక్కలు, వంపుతేలిన ముక్కుని కలిగుండే ఈ పక్షుల శరీరాకృతి అన్ని పక్షుల కంటే కాస్త భిన్నంగానే వుంటుంది.

◆ఇవి అతి ఉష్ణ అడవులు, కొండ ప్రాంతాల్లో ఎక్కువగా నివాసాలని ఏర్పరచుకుంటాయి.

◆వెలుతురు చొరబడని ప్రాంతాల్లో పగలంతా సేదతీరుతుండే ఈ పక్షులు రాత్రి పూట మాత్రమే సంచారం చేస్తూ ఆహారాన్ని సమకూర్చుకుంటాయి.

◆1900 నాటికి మన దేశంలో వీటి సంఖ్య తగ్గుముఖం పట్టింది. అప్పట్లో కారణాలని ఎవరూ కనుక్కోలేకపోయారు.

◆తిరిగి 1986లో కడపలో కొన్ని జోర్డాన్‌లను గుర్తించారు.

◆1988లో భారతీయ తపాలా శాఖ కలివిడి కోడి ముఖచిత్రంతో స్టాంపును విడుదల చేసింది.

◆అడవుల నరికివేత, వేటాడటంతో పాటుగా కలప కోసం ఎక్కువగా చెట్లను నరికివేయడం కారణంగా ఇవి తమ ఉనికిని కోల్పోయాయి.

◆ప్రపంచవ్యాప్తంగా వీటి సంఖ్య 250 కంటే తక్కువనేది బర్డ్‌లైఫ్ ఇంటర్నేషనల్ నివేదిక.

◆1999 నాటికి వీటి సంఖ్య పూర్తిగా తగ్గిపోవడంతో యుఎన్‌సిఐ రెడ్‌లిస్ట్‌లో వీటి పేరుని ప్రకటించింది.

◆అతి తక్కువ సంఖ్యలో వున్న ఈ పక్షులని రక్షించేందుకు వన్య ప్రాణి సంరక్షణ చట్టం 1972 షెడ్యూల్ –1 ప్రకారం ప్రభుత్వం వీటిపై వేటని నిషేధించింది.

పదవికాసం - 63

కూర్పు: రావెళ్ల

ఆధారాలు

అడ్డం

1. ఉచితంగా శారీరక శ్రమను అందించడం (4)
3. నైపుణ్యం (4)
7. పెద్ద గంప (2)
8. చాలా సంతోషం (3)
9. చెట్టు (2)
12. లంచం (3)
13. ఓటు హక్కు ఉన్నవారు (3)
17. ధ్యానం (2)
18. కొలను (3)
19. దండనం (2)
22. కలగలపు (4)
23. విల్లు పూనినవారు (4)

1		2		■	3	4		5
	■		■	6	■		■	
7		■	8			■	9	
	■	10	■		■	11	■	
■	12			■	13			■
14	■		■	15	■		■	16
17		■	18			■	19	
	■	20	■		■	21	■	
22				■	23			

నిలువు

1. మరణించిన వ్యక్తికి అర్పించే జోహార్లు (4)
2. త్రోవ (2)
4. మత్తు (2)
5. కొడుకు (4)
6. రికార్డుల్లోకి ఎక్కడం (3)
10. విడుదల (3)
11. సత్తువ (3)
14. మబ్బు (4)
15. గడ్డి పోచ (3)
16. యాచకుడు (4)
20. తుదిలేని 'ప్రసరింపజేయు' (2)
21. ప్రవాహం (2)

సుడోకు

2		9		8		3		
	6	1	5		2		9	
	7	8	3			6	1	
		3						
6					4	9		
	8			3	1	4		
	5	4	2				3	
9		7	8	1	3			
				9			2	

గతవారం జవాబులు

3	6	7	4	8	1	5	9	2
5	8	2	6	9	3	7	1	4
9	1	4	5	2	7	6	3	8
6	9	1	7	5	4	8	2	3
8	7	3	9	1	2	4	5	6
2	4	5	8	3	6	9	7	1
1	5	8	3	4	9	2	6	7
4	2	6	1	7	5	3	8	9
7	3	9	2	6	8	1	4	5

1 అం	గ	2 బి	ళ్ళ	■	3 ఇం	4 దీ	వ	5 రం
గీ	■	రి	■	6 పూ	■	పం	■	తు
7 ర	క్ష	■	8 వ	లు	9 వ	■	10 బా	కా
స	■	11 దీ	నం	■	12 రీ	13 ధ	■	దు
■	14 క	పి	■	■	■	15 రి	క్రం	■
16 జై	■	17 క	18 ష్టం	■	19 రా	త్రి	■	20 అ
21 జీ	రా	■	22 ఇ	23 టు	క	■	24 అ	భి
కు	■	25 పా	■	వీ	■	26 ఉ	■	మా
27 డు	కా	లు	వి	■	28 ఉ	త్ప	త	నం

ఇవి సజీవ పటాలు. నీటిని చిలకరిస్తే పచ్చగా నిలిచిపోతాయి చాలాకాలం. కాక్టస్ జాతులకు చెందిన చిన్ని మొక్కల్ని ఇలా ఫొటోఫ్రేముల్లో పెంచి అలంకరించుకోవడం ఇప్పుడో ట్రెండ్. లోతైన ఫ్రేములో మట్టి ఇతర ఎరువులు వేసి జాలి కట్టి వాటిల్లో జెముడు పిలకల్ని నాటుతారు. అవి వేళ్లూనుకుని కాస్త బలపడ్డాక గోడకు తగిలిస్తారు. అయితే వివిధ జాతుల సక్యులెంట్లను ఎలా అమర్చాలో తీర్చిదిద్దాలో తెలిస్తే ఇంటీరియర్ డిజైనర్‌లా మార్కులు కొట్టేయొచ్చు. వీలైతే దీన్నే ఉపాధి అవకాశంగాను ఎంచుకోవచ్చు. సక్యులెంట్ల పెంపకం మీద అవగాహనకు తోడు కాసింత సృజనాత్మకత తోడైతే ఇలా సజీవ పటాల్ని మీరే సొంతంగా రూపొందించొచ్చు.



పచ్చని పటాలు





లేత గులాబీ నీళ్లు

సరస్సులు పక్కనున్న అడవి పచ్చదనాన్ని పరుచుకుంటాయి. లేదా ఆకాశాన్ని ప్రతిబింబించి నీలాన్ని కప్పేసుకుంటాయి. కానీ ఈ సరస్సులు మాత్రం లేత గులాబీని కలిపేసుకున్నాయి. నీటిలో అత్యధిక లవణీయతతో పాటు డ్యూనాలియెల్లా సెలీనా అనే గులాబీ రంగు ఆల్గే ఉండటం వల్లే వీటికి ఆ రంగు వస్తుంది. మృత సముద్రంలోని నీటి కన్నా వీటిలోని ఉప్పు శాతం ఎక్కువ. కొన్నింటిలో 40 శాతానికి మించి లవణీయత ఉంటుంది. ఈ గులాబీ సరస్సుల్లో అందమైంది లాక్ రోజ్. స్థానికంగా రెట్బాగా పిలుచుకునే ఈ సరస్సు సెనెగల్‌లోని క్యాప్ వెర్ట్ ద్వీపసముదాయంలో ఉంది. అట్లాంటిక్ సముద్రంలోని దీవిలో సముద్రానికి దాదాపు ఆనుకున్నట్టుగా ఉండటం లాక్ రోజ్ ప్రత్యేకత. పొడి కాలంలో (నవంబర్ నుంచి జూన్ మధ్య) ఇక్కడో అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుంది. నిండు గులాబీ రంగులోని పొదలు, శ్వేత వర్ణపు తీరం, పచ్చని చెట్లు, ఎర్రటి ఇసుక, మట్టి దిబ్బలు మధ్య సరస్సు మరింత రంగులో కనిపిస్తుంది. ఆ దీవి చుట్టూ ఉండే సముద్రం నీలి రంగులో ఫ్రేమ్ కట్టినట్టు ఉంటుంది. స్థానికులు ఉప్పుని తీస్తూ జీవనం సాగిస్తుంటారు. పర్యాటకంగా కూడా పేరు రావడంతో అదో అదనపు ఆదాయమవుతోంది. రెట్బనే కాదు క్రిమియాలోని సేసిక్-శివాష్, టర్కీలోని టుజ్, మెక్సికోలోని లాస్ కొలరాడస్, అజెర్‌బైజాన్‌లోని మసాజిర్ సరస్సులు గులాబీ వన్నెల్లోనే ఉంటాయి.



Check List

Book Number	KNSR02B170	**Date**	03/09/22
Front Cover	yes	**Back Cover**	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mouni	**Cutting By**	Mouni
Scanned By	prathyusha	**Pages**	29